





# ఆకాంక్ష

T/TG/2024/0523/7229/1544

తెలుగు సంచలన దిన పత్రిక








పబ్లిష్ : తెలంగాణ బుధవారం 21 -05-2025 సంపుటి ; 01 సంచిక :163 ఎడిటర్ ; పెనుగొండ సతీష్ పేజీలు ; 08 వెల ; 5 రూ/-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla





# రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

## మార్ఫింగ్ ఫోటోలు డిలీట్ చేసేందుకే శ్రీనివాస్ యత్నం

- హార్డ్ డిస్క్ చోరీలో శ్రీనివాస్ హస్తం
- ఎలాంటి ఫైళ్లు మాయం కాలేదని పోలసుల గుర్తింపు



**హైదరాబాద్, మే20 (ఆకాంక్ష ):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన రాజ్‌భవన్ చోరీ కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. తోటి మహిళా ఉద్యోగిని ఫోటోలు మార్ఫింగ్ చేసి రాజభవన్ ఉద్యోగి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసులు విచారణలో బయటపడింది. రాజ్‌భవన్‌లో చోరీ కేసులో నిందితుడిని పంజాగుట్ట పోలీసులు రెండుసార్లు అరెస్ట్ చేశారు. మార్ఫింగ్ ఫొటో విషయంలో మొదటి సారి అరెస్ట్ చేయగా.. రెండో సారి రాజభవన్‌లోని హార్డ్ డిస్క్ చోరీ కేసులో నిందితుడిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సస్పెండ్ అయినప్పటికీ సెక్యూరిటీ-ని మాయ చేసి నైట్ -టైంలో ఎంట్రీ- ఇచ్చినట్లు- పోలీసులు గుర్తించారు. అయితే ఆ ఉద్యోగి వారంలో రెండు సార్లు అరెస్ట్ కావడం సంచలనం రేపుతోంది. రాజ్ భవన్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ తన తోటి మహిళకు కొన్ని మార్ఫింగ్ ఫోటోలను చూపించాడు. ఎవరో తనకు ఈ ఫోటోలు పంపిస్తున్నాడు జాగ్రత్త అని చెప్పాడు. ఇంకా చాలా ఫోటోలను తన సిస్టంకు

మిగతాది 2 లో...

# మినీ అంగన్‌వాడీల జీతాలు పునరుద్ధరించాలి

## సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

- పెంచిన జీతాలు ఎలా తగ్గిస్తారో చెప్పాలి
- తెలంగాణ రైజింగ్ అంటే ఇదేనా

మిగతాది 2 లో...



**హైదరాబాద్,మే20(ఆకాంక్ష ):** మినీ అంగన్వాడీ కార్యకర్తలను అంగన్వాడీలుగా గుర్తించి పూర్తి జీతం చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. అంగన్వాడీలుగా గుర్తించి ఏడాది దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇప్పటికీ పెరిగిన జీతం ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఇచ్చిన జీవోను కాపీ కొట్టి రేవంత్ సర్కార్ ప్రచారం చేసుకున్నదని మండిపడ్డారు. మూడు నెలలు మాత్రమే పెంచిన జీతం ఇచ్చి గతేడాది కాలంగా వారిని పాత జీతానికే పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీతాన్ని రూ. 13,650 నుంచి తిరిగి రూ. 7,800కి తగ్గించడం దారుణమని, బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమోనని ఎద్దేవా చేశారు. అన్నింటా తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు లేఖ రాశారు. జనవరి 2024 నుంచి 12 నెలలకు పెరిగిన జీతాలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీ కేంద్రాలుగా మారిన ప్రతీ చోట హెల్పర్లను నియమించాలన్నారు. మే నెల పెరిగిన జీతాలు అందని జిల్లాల్లో తక్షణమే చెల్లించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళల కడుపు కొడుతున్నాదని మండిపడ్డారు. మే నెల జీతాన్ని 8 జిల్లాల్లో మాత్రమే ఇచ్చి మిగతా జిల్లాల వారికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

# గుల్జార్‌హౌజ్ అగ్నిప్రమాదం

## ప్రమాదాలపై ఐదుగురు అధికారులతో కమిటీ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్, మే20 (ఆకాంక్ష ):** హైదరాబాద్ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో గుల్జార్ హౌజ్ వద్ద ఈ నెల 18న జరిగిన అగ్ని ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు-, ఆరుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ నిర్ణయం నేపథ్యంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, ప్రభుత్వ చర్యలపై స్పష్టతనిచ్చారు. ఈ విచారణ కమిటీకి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, సీపీ సీవీ ఆనంద్, ఫైర్ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ముషారఫ్ వంటి కీలక పదవులలో ఉన్న అధికారులను నియమించారు. ఈ కమిటీ బాధ్యత, గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం జరిగిన కారణాలు, ఘటన అనంతరం తీసుకున్న చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయడం. కేవలం కారణాలపై నివేదిక తయారు చేయడమే కాకుండా, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి, క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు చేయాలి వంటి విషయాలపై కమిటీ- స్పష్టమైన

మిగతాది 2 లో...

# వక్ఫ్ చట్టంపై మరోమారు సుప్రీం విచారణ

## ప్రతిపాదిత మూడు అంశాలపైనే విచారణ • సుప్రీంను కోరిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, మే20 (ఆకాంక్ష ):** వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే.. దాన్ని మూడు అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరఫున వాదనలు వినిపిస్తూ.. గత బెంచ్ లాగానే విచారణను పరిమితం చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్

మిగతాది 2 లో...



# కాళేశ్వరంలో అవినీతి వెలికి తీసే పనిలో కమిషన్

## కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరుకావాలి ■ ఈటెల బిజెపిలో బిఆర్ఎస్ కోవర్ట్



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే20 (ఆకాంక్ష ):** రాజకీయ కక్షతో కాదు, కేవలం అవినీతి చెందిన బాధ్యులను వెలికితీసే ఉద్దేశంతోనే కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే పార్టీ కాంగ్రెస్‌లో వివక్షకు అవకాశం లేదు. వివేక్, వంశీలపై ఎలాంటి వివక్ష లేదని పేర్కొన్నారు. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న వివాదాల నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ

# కాక కోటాలో వారసుడికి అవమానం...

## పారిశ్రామికవేత్తగా మొదలు, ప్రజాప్రతినిధిగా ఎదిగిన గడ్డం వంశీ...

**ప్రజా ప్రతినిధుల మౌనం... కాంగ్రెస్ పార్టీపై తిరోగమనం?**

**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** ప్రముఖ నేత కాక వెంకటస్వామి కుటుంబం ఇప్పుడు ఓ అవమాన ఘటనతో వార్తల్లో నిలిచింది. మాజీ ఎంపీ కాక వెంకటస్వామి మనవడు, ప్రస్తుత పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకి భూపాలపల్లి జిల్లా సరస్వతి పుష్కరాల్లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో చోటు చేసుకున్న



సంఘటన తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఆనాడు పేద ప్రజల కోసం తాత ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజల కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన ఘనత వారికే దక్కింది. అయితే భూపాలపల్లిలో ఇటీవల నిర్వహించిన సరస్వతి పురస్కారాల కార్యక్రమంలో గడ్డం వంశీ పేరు, పోస్టర్లలో ప్రస్తావన లేకపోవడం %-% ఇది కేవలం చిన్న పొరపాటేనా? లేక సంకల్పితమైన దుశ్చర్యా? అనే

మిగతాది 2 లో...

# కాళేశ్వరం విచారణను నీరుగార్చే కుట్ర

## బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కుట్రరాజకీయయం

## బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్




**హైదరాబాద్ ,మే20 (ఆకాంక్ష ):** కాళేశ్వరం కూలడానికి కారణమేవరో తేల్చడానికి ఇంత ఆలస్యమెందుకని బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణను నీరు గార్చేందుకు ప్రయత్నం జరుగుతోందని అన్నారు. విద్యుత్తు కొనుగోళ్ల విషయంలోనూ విచారణను నీరుగార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య డీల్ కుదరడం వల్లే ఈ విచారణలను పక్కదోవ పట్టిస్తున్నారని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కొన్ని వేల కోట్లు- ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేశారని ప్రభాకర్ అన్నారు. సాగునీరు ఇచ్చే సమయానికి ఆ ప్రాజెక్టు కుంగిపోయిందని చెప్పారు. రేవంత్ ప్రభుత్వం ధాన్యాన్ని కొనకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. దళారులకు ధాన్యం వదిలిపెట్టడంతో

మిగతాది 2 లో...

# నల్లమల అభివృద్ధికి ప్రత్యేక కృషి:నల్లమల డిక్లరేషన్ ఆవిష్కరణ

- నల్లమల డిక్లరేషన్ ఆవిష్కరణ
- రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు
- ఇందిర సౌర గిరిజల వికాసం' పథకం ప్రారంభం
- నల్లమలను ఆదర్శంగా నిలుపుతానన్న సిఎం రేవంత్





**అమ్రాబాద్, మే19 (ఆకాంక్ష ):** నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరిజల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన

మిగతాది 2 లో...

# మినీ అంగన్‌వాడీల జీతాలు పునరుద్ధరించాలి

మినీ అంగన్వాడీలు ప్రచార సాధనాలు కాదని, వారికి నిజమైన గౌరవం ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న మానసిక వేదన, వారి కుటుంబాలు ఎదుర్కొంటు-న్న ఇబ్బందుల గురించి మీ దృష్టికి తీసుకురాదలిచాను. రాష్ట్రవ్యాప్తంగా 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలున్నారు .వీరంతా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అత్యంత పేదవర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్తల కష్టాలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 5న వారికి అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జీవో జారీ చేసింది. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఉత్తర్వులు అమలు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీతక్క. మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేసిన సంగతి మీకు తెలిసే ఉంటుంది. 2023 డిసెంబర్ 15న ఇదే విషయంపై జీవో కూడా జారీ చేశారు. కానీ, అది గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో. దాన్నే తిరిగి కొత్తగా ప్రచారం కోసం విడుదల చేసి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. 2024 జనవరి నుంచి మార్చి వరకు



మూడు నెలలు అంగన్వాడీ పే గ్రేడ్‌లో రూ.13,650 జీతం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత మినీ అంగన్వాడీ జీతం రూ.7,800కి తగ్గించి, 2025 ఏప్రిల్ వరకు అదే జీతం చెల్లించింది. ఈ విధంగా, మూడు నెలలు అంగన్వాడీలుగా గుర్తించి, తిరిగి సంవత్సర కాలం మినీ అంగన్వాడీ జీతాలతో పనిచేయించడంతో వీరి కుటుంబాలకు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేసింది. బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమో! అన్నిట్లో తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మినీ అంగన్వాడీలు తమ హక్కుల కోసం మంత్రిని, అధికారులను అనేకసార్లు కలిసినా, ప్రభుత్వం స్పందించలేదు. బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంపై ప్రశ్నించిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మళ్లీ పాత జీవోను తిరిగి విడుదల చేస్తూ, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తున్నామని ప్రచారం చేసుకున్నారు.ఒకే పనికి రెండు సార్లు జీవోలు జారీ చేసి, రాజకీయ ప్రచారం చేసుకోవడం తప్ప, మినీ అంగన్వాడీలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి మరీ మహిళలను మోసం చేశారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేస్తామని మోసం, రాష్ట్రంలో ప్రతి మహిళకు 2,500 రూపాయలు ఇస్తామని మోసం, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తానని మోసం, లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని మోసం, కల్యాణ లక్ష్మితో పాటు-తులం బంగారం ఇస్తామని మోసం, చదువుకునే ఆడపిల్లలకు స్కూటీ-లు ఇస్తానని మోసం, అంగన్వాడీలకు 18,000 నెలసరి జీతం పెంచుతామని మోసం, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలను చేస్తామని మోసం. ఇలా కాంగ్రెస్ మహిళలకు చేసిన మోసాల లిస్ట్ రాస్తే చాంతాండంత అవుతుందన్నారు.

## నల్లమల అభివృద్ధికి ప్రత్యేక కృషి:నల్లమల డిక్లరేషన్ ఆవిష్కరణ

సభలో సీఎం మాట్లాడారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. అనంతరం నల్లమల ప్రాంతం గురించి సీఎం ప్రసంగించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారని నాటి రోజులను సీఎం గుర్తు చేశారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగిపోతోందన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తామని శుభవార్త చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తామని అన్నారు. దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చానని గుర్తు చేశారు. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్న బియ్యం అందుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు- ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. గతంలో వరి వేస్తే ఉరే అని ఆనాడు అన్నారు.. ఆ దొర మాత్రం వందల ఎకరాల్లో వరి వేసుకున్నారు.. మీరు వరి పండిస్తే బోనస్ ఇస్తామని మేము చెప్తున్నాం.. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం.. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరూ తినేవారు కాదు.. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకున్నాం. నిత్యావసరాల ధరలు తగ్గించడంలో మనమే నంబర్ వన్ అని కేంద్రం చెప్పింది.. శాంతి భద్రతల్లో కూడా మనమే నంబర్ వన్‌లోనే ఉన్నాం.. రాష్ట్ర ఆదాయంలో కూడా తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రమే చెప్పింది.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం రూ.60 వేల కోట్లు- ఖర్చు చేశాం అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం అన్నారు. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటుందని రేవంత్ అన్నారు. అనంతరం సతీమణితో సహా సీఎం రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, సీతక్క తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం విచారణను నీరుగార్చే కుట్ర

ఇష్టారాజ్యంగా మారిందని విమర్శించారు. ధాన్యం కొనేవారు లేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. ధాన్యం కేంద్రాలను మండల స్థాయిలో ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. బీర్లు, భూములు అమ్ముతున్న ప్రభుత్వం తాజాగా రాష్ట్రమంతా అందాల భామలను తిప్పుతోందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి ఆలస్యం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎంపిక రొటీన్ ప్రాసెస్‌లో జరుగుతుందని తెలిపారు. త్వరలో అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు.

## గల్జార్‌హౌజ్ అగ్నిప్రమాదం

ప్రతిపాదనలు సమర్పించనుంది. ఘటనపై నివేదిక అందిన అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటారని మంత్రి పొన్నం వెల్లడించారు. ప్రజల ప్రాణాలు విలువైనవని, భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఇటు-వంటి ఘటనలపై సున్నితంగా స్పందించడమే కాకుండా, తక్షణమే పరిష్కార మార్గాలు అన్వేషించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కమిటీ- ఏర్పాటు-ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

## పనిచేసిన వారికే పార్టీలో పదవులు

### పైరవీ చేసి తెచ్చుకుంటే పక్కన పెడతాం

### మినీ మహానాడులో భూమా అఖిలప్రియ వార్నింగ్



**నంద్యాల, మే20 (ఆకాంక్ష ):** మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సంచలన వ్యాఖ్యలు చేశారు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.. మాకు తెలియకుండా ఎవరైనా పదవులు తెచ్చుకుంటే వారిని నియోజకవర్గంలో కూడా అడుగుపెట్టనివ్వం అంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.. పదవులు ఇవ్వాలను కుంటే మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి మాత్రమే ఇవ్వండి అని సూచించారు.. లేకపోతే అసలు పని చేయని వాళ్లకి పదవులు ఇస్తే అది కరెక్ట్ కాదు అని హితవుచెప్పారు.. ఈ విషయం పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు వెల్లడించారు.. పార్టీ కోసం, భూమా కుటుంబం కోసం పనిచేసిన వారికి తప్పకుండా పదవులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విపక్షాలతో పాటు-.. కొందరు సొంత పార్టీ నేతలను కూడా టార్గెట్ చేస్తూ భూమా అఖిల ప్రియ పలు సందర్భాల్లో సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే.. అయితే, ఇప్పుడు మినీ మహానాడు వేదికగానే.. అది కూడా పార్టీ నేతలపై భూమా అఖిలప్రియ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆళ్లగడ్డ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిపోయింది.. మరోవైపు, మన దేశ సైనికులకు సంఘీభావంగా ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నేతృత్వంలో తిరంగా ర్యాలీ నిర్వహించిన విషయం విదితమే.. ఈ సందర్భంగా పాకిస్తాన్ యుద్ధంలో అమరవీరుడైన తెలుగు జవాన్ మురళీ నాయక్‌కు అఖిల ప్రియ నివాళులు అర్పించారు. చాలా రోజుల తర్వాత జాతీయ జెండాను పట్టు-కున్నానని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే అఖిల ప్రియ తన ఐదు నెలల జీతాన్ని ఆర్మీకి విరాళంగా ప్రకటించిన విషయం విదితమే.. ఇక, టీ-డీపీ మినీ మహానాడులో ఎమ్మెల్యే అఖిల ప్రియ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వర్కులను చేసుకొని 60 శాతం, 40 శాతం కమిషన్లు తీసుకుందామంటూ వైసీపీ నాయకులు రాయబారం పంపారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈరోజు గెలిచామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో లాగా కాకుండా.. ప్రతి ఒక్క కార్యకర్తకు, ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తాం అని హామీ ఇచ్చారు. ఈ గెలుపు తనది కాదని, ప్రజల గెలుపు అని ఎమ్మెల్యే అఖిల ప్రియ చెప్పుకొచ్చిన విషయం విదితమే..



# వక్ఫ్ చట్టంపై మరోమారు సుప్రీం విచారణ

ధర్మాసనానికి తెలిపారు. కోర్టు మూడు అంశాలను గుర్తించిందని తుషార్ మెహతా తెలిపారు. ఆ మూడు అంశాలపై సమాధానం ఇచ్చామని.. తాజాగా పిటిషనర్లు లిఖితపూర్వక సమర్పణల్లో అనేక ఇతర అంశాలను లేవనెత్తుతున్నారన్నారు. తాము మూడు అంశాలపై అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలనేది కేంద్రం తరఫున విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ వాదనను పిటిషనర్లు వ్యతిరేకించారు. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి సొలిసిటర్ జనరల్ వాదనను వ్యతిరేకించారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బై-యూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ-నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా.. మూడు అంశాల విషయానికి వస్తే.. వక్ఫ్ బై యూజర్ లేదంటే.. వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం కాగా.. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా.. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు. అంతకన్నా తాము చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరఫు లాయర్ కపిల్ సిబాల్ అన్నప్పుడు సీజేఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాగా, మంగళవారంనాడు విచార సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన మూడు అంశాలకు తాము సమాధాం దాఖలు చేశామన్నారు. అయితే ఇప్పుడు పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాలు ఇతర అంశాలను ప్రస్తావించాయని, విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు.ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వచ్చో పరిశీలిస్తామని గత సీజేఐ సంజీవ్ ఖాన్నా చెప్పారని, అందువల్ల కేవలం మూడు అంశాలకే తాము పరిమితమవుతామని చెప్పలేమని అన్నారు. వక్ఫ్ భూములను లాక్కోవడానికే చట్టం తెచ్చారని సిబాల్ వాదించారు. ఎలాంటి పక్రియ లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశమన్నారు.

## కాళేశ్వరంలో అవినీతి వెలికి తీసే పనిలో కమిషన్

అద్దంకి దయాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంలో తప్పులు జరిగాయనే కారణంతోనే కమిషన్ కొంత సమయం తీసుకుని నివేదిక రూపొందించిందని ఆయన అన్నారు. కాళేశ్వరం విచారణలో కేసీఆర్, ఈటెల, హరీష్ రావులపై ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడం ముఖ్యమైన పరిణామంగా అభివర్ణించారు. వారు తప్పు చేయలేదంటే వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరంలో తప్పు జరిగిన విషయాన్ని కమిషన్ తేల్చిందని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. విచారణ కమిషన్ శీలాన్ని శంకించాల్సిన అవసరం లేదు.. సాంకేతిక సమాచారం కోసం ఆలస్యం జరిగిందని అన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే, శిక్ష తప్పదని.. కేసీఆర్ అమెరికా పారిపోవాలని చూస్తున్నట్టున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి పని చేయొద్దని, ప్రభాకర్ రావు వెళ్లినట్టు- మీరు పోకండని హెచ్చరించారు. అలాగే కాళేశ్వరం నీటిని లిఫ్ట్ చేయడానికి కాదు, క్యాష్ లిఫ్టింగ్ చేయడానికే వాడుకున్నారు. తెలంగాణను దొంగల దొడ్డిగా మార్చారు అంటూ మండిపడ్డారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ఒక్క పిల్లర్ అయినా కూలిందా? కానీ కన్నెపల్లె పంపు హౌస్ ఎందుకు మునిగిందని నిలదీశారు.మరోవైపు ఈటెలపై కూడా సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. ఈటెలను బీజేపీలోకి కావాలనే పంపించారా కేసీఆర్? బీఆర్ఎస్ లో అక్రమాలు చేసిన తర్వాతే ఆయన పార్టీ మారారన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు సీల్డ్ కవర్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. అలాగే కిషన్ రెడ్డి లాంటి బానిసలతోనే దేశానికి నష్టం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసారు. దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్ల పట్ల బీజేపీకి విధానం లేదని, రాహుల్ గాంధీ మీద మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు లేదని ఆయన అన్నారు. బీజేపీ నేతలు ఎవరైనా దేశ స్వాతంత్రంలో పాల్గొన్నారా..? అంటూ ప్రశ్నించారు. పాకిస్తాన్ కు సమాచారం ఇచ్చిన కేంద్ర మంత్రి దేశ ద్రోహి కాదా.. కిషన్ రెడ్డి నల్లి కుట్ల లెక్క ఉంటాడని ఘాటు వ్యాఖ్యలు చేసారు. బీజేపీ కాదు.. బూతు జనతా పార్టీ, నీఛాతి నీచమైన బాషా.. సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని.బిజెపి పార్టీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి అంటే. భారతీయ జనతా పార్టీ కాదని.. అది బూతు జనతా పార్టీ అని మండిపడ్డారు. బిజెపి సోషల్ మీడియా వాళ్లకు సిగ్గు, లజ్జ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ భవన్ లో అద్దంకి మీడియాతో మాట్లాడుతూ.. 'బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నల్లికుట్లోడి లాగ కనిపిస్తాడు.. కానీ ఇంత నీచపు సోషల్ మీడియా నడిపిస్తున్నాడు. వాళ్ల మీద కేసు పెడదామంటే ఒక్కరికి కూడా మొహం ఉండదు. నా పాత వీడియోలు తీసుకొచ్చి బుద్ధి లేకుండా ట్రోల్ చేస్తుందని దుయ్యబట్టారు. ప్రపంచంలో మూడు జెండర్స్ ఉన్నాయని.. బిజెపి వాళ్ళు ఏ జెండరో తేల్చుకోవాలని చురకలంటించారు. మీలాంటి బూతు భాష వాడే జాతి.. ఈ భూమి మీద ఎక్కడ లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ధ్వజమెత్తారు.

# రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

కూడా పంపించాడని భయపెట్టాడు. దీంతో కలవరానికి గురైన మహిళ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు..ఆ మార్ఫింగ్ ఫోటోలను శ్రీనివాస్ పంపించాడని తేల్చారు. దీంతో వెంటనే శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి వారం కింద రిమాండ్‌కు పంపారు. ఈ ఘటనతో రాజ్‌భవన్ అధికారులు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. జైలుకు వెళ్లిన శ్రీనివాస్ రెండు రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చిన అతడు రాత్రి సమయంలో సెక్యూరిటీని మభ్యపెట్టి లోపలికి వెళ్ళాడు. తన కంప్యూటర్‌లో ఉన్న హార్డ్ డిస్క్‌ను చోరీ చేసుకుని వెళ్ళిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులకు రాజభవన్ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అధికారులు సీసీ కెమెరాల ద్వారా శ్రీనివాస్ చోరీని గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ హార్డ్ డిస్క్‌లో మహిళకు సంబంధించిన ఫోటోలు ఉండడంతో ఆ సాక్ష్యాలను డిలీట్ చేసే ప్రయత్నంలో చోరీకి పాల్పడ్డాడని తెలిసింది. దీంతో శ్రీనివాస్‌ను పోలీసులు రెండో సారి జైలుకు పంపారు. తొలుత రాజ్‌భవన్‌లో జరిగిన చోరీ కీలక హార్డ్ డిస్క్‌లు, ఫైళ్లు మాయం అయినట్లు- ప్రచారం జరిగింది. అయితే ఫైళ్ల మాయంపై పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ వివరణ ఇచ్చారు. రాజ్ భవన్‌లో పనిచేసే ఓ మహిళ.. తన ఫోటోలను ఐటీ- ఉద్యోగి శ్రీనివాస్ మార్ఫింగ్ చేసినట్లు- తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు ఈనెల 12న శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని.. ఈ ఘటన తర్వాత శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు ఉన్న హార్డ్ డిస్క్‌ల కోసం శ్రీనివాస్ మళ్ళీ రాజ్ భవన్‌కు 14న వచ్చాడని.. హెల్మెట్ ధరించి హార్డ్ డిస్క్‌లను దొంగలించా డన్నారు. దీనిపై దర్యాప్తు చేసి శ్రీనివాస్‌పై మరో కేసు నమోదు చేశామని.. 15న అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. రాజ్ భవన్‌లో ఎలాంటి డాక్యుమెంట్లు-, ఫైల్స్ చోరీ అవ్వలేదని.. రాజ్ భవన్‌లో ఎలాంటి బయట వ్యక్తుల చోరీ జరగలేదని ఏసీపీ మోహన్ కుమార్ స్పష్టం చేశారు.

# రైతులు సీ.సీ.ఆర్.సి కార్డులకు దరఖాస్తు చేసుకోండి:తహసీల్దార్ బి.విజయప్రసాద్



**ఘంటసాల, ఆకాంక్ష :** భూ యజమానులు, కౌలు రైతులు సీ.సీ.ఆర్.సీ కార్డులు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ కోరారు.మంగళవారం కొడాలి రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు, య జమానులకు పంట సాగు దారు హక్కు పత్రం (సిసిఆర్సి)లపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కౌలు చేసే ప్రతీ రైతుకు పంట సాగుదారు హక్కు పత్రాలను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఘంటసాల మండలంలో 2650 పంట సాగుదారు హక్కు పత్రాలు జారీ చేసేలా లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు.సీసీఆర్సి కాలవ్యవధి కేవలం 11 నెలలు మాత్రమే అన్నారు. భూ యజమానులకు, పంట సాగు చేసే కౌలు రైతులకు ఇబ్బంది లేని విధంగా పటిష్టమైన చట్టం ద్వారా సీసీఆర్సి అందజేయటం జరుగుతుందని తెలిపారు. పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాల్సిన కౌలు రైతులు సాగు చేసే భూమి వివరాలతోపాటు కౌలుదారు ఆధార్ కార్డు, 2 పాస్ పోస్టు సైజు ఫొటోలతో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాని తెలిపారు.మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ సాగు చేసే కౌలు రైతులు వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై విత్తనాలు. ఈ-క్రాఫ్ బుకింగ్, పంట నష్టం, పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, పంటరుణాలు తదితర పథకాలు పొందేందుకు పంట సాగు హక్కు పత్రాలను ప్రామాణికంగా తీసుకోవటం జరుగుతుందన్నారు. కావున కౌలు చేసే ప్రతీ రైతు సిసిఆర్సీ పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఏఏ వి.వెంకటలక్ష్మి. రైతులు పాల్గొన్నారు.

# యోగ ప్రాముఖ్యతను తెలియజేసేలా యోగాంధ్ర కార్యక్రమం:జిల్లా ఇంచార్జ్ కలెక్టర్



**మచిలీపట్నం, ఆకాంక్ష :** యోగ ప్రాముఖ్యతను తెలియజేసేలా యోగాంధ్ర కార్యక్రమమును నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ కోరారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవమును పురస్కరించుకొని ఆ రోజున విశాఖపట్నం సముద్రం ఒడ్డున రాష్ట్రస్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారని, ఆ కార్యక్రమానికి భారత ప్రధానమంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు మే 21వ తేదీ నుంచి జూన్ 21 వరకు యోగ ప్రాముఖ్యతను తెలియజేసేలా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని నగరంలో నిర్వహిస్తున్నామని, రేపు ఉదయం నగరంలో ర్యాలీ, అనంతరం బ్యాట్మెంటన్ కోర్టు ఇండోర్ స్టేడియంలో కార్యక్రమం ప్రారంభిస్తామని, ముగింపు కార్యక్రమం మంగినపూడి బీచ్ లేదా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ప్రకారం కార్యక్రమం సజావుగా నిర్వహించేలా సమన్వయం చేసుకుంటూ సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, మండల, గ్రామస్థాయి యోగాంధ్ర కార్యక్రమాలలో యోగాభ్యాసాలు వేయించేందుకు నైపుణ్యం కలిగిన శిక్షకులను 26 మండలాలకు గుర్తించాలన్నారు. జూన్ మాసంలో పాఠశాలలు, కళాశాలల పునప్రారంభం తర్వాత అక్కడ కూడా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా సూచించారు.డిఆర్ఓ కె చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఉదయం 6:30 గంటలకు నగరంలోని సాయిబాబా గుడి నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లాకోర్టు సమీపంలోని బ్యాడ్మింటన్ కోర్టు ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీకి సంబంధించిన జెండాలు, బ్యానర్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో కె.ఆర్.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు తదితర శాఖాధికారులు పాల్గొన్నారు

# మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత త్రాగునీరు సరఫరా

*ఇరాలి గ్రామంలో 20 వేల లీటర్ల త్రాగు నీరు*



**కోడూరు, ఆకాంక్ష:** వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో తీర గ్రామాల దాహం తీర్చేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉచిత త్రాగునీరు సరఫరా చేశారు. మంగళవారం కోడూరు మండలం ఇరాలి గ్రామ ప్రజలకు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా త్రాగునీరు సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

# సర్పంచ్ సురేఖ కుటుంబానికి అండగా ఉంటాం

- గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము....
- ప్రమాదవశాత్తు మరణించిన దొండపాడు సర్పంచ్ సురేఖ కుటుంబ సభ్యులను పరామర్శించిన...ఎమ్మెల్యే రాము
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులను ఓదార్చి....మనోధైర్యం చెప్పిన ఎమ్మెల్యే



**గుడివాడ, ఆకాంక్ష :** దొండపాడు గ్రామ సర్పంచ్ దివంగత చోరగుడి సురేఖ ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని... సోదరి సురేఖ కుటుంబ సభ్యులకు పార్టీ తరపునే కాకుండా వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. విద్యుత్ మోటర్ షాక్ ప్రమాదంలో మరణించిన గుడివాడ రూరల్ మండలం దొండపాడు గ్రామ సర్పంచ్ స్వర్గీయ చోరగుడి సురేఖ కుటుంబ సభ్యులను మంగళవారం సాయంత్రం గ్రామంలోని స్వగృహంలో పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాము పరామర్శించారు. తనను చూడగానే కన్నీటి పర్యంతమైన సురేఖ కుటుంబ సభ్యులను ఆత్మీయ ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే రాము ఓదారుస్తూ వారికి మనోధైర్యం చెప్పారు. సోదరి సురేఖ మరణం బాధాకరణమని ఇలాంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలంటూ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రాము ఓదార్చారు. సురేఖ కుమార్తె ఉన్నత స్థితికి చేరుకోవడానికి పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా తాను సహకరిస్తానని, అధైర్య పడకుండా బాగా చదువుకోవాలంటూ సురేఖ కుమార్తెను ఎమ్మెల్యే రాము ఓదార్చారు.అనంతరం ఘటన ప్రాంతంలో ప్రమాద వివరాలను కుటుంబ సభ్యులు మరియు గ్రామ పెద్దలు ఎమ్మెల్యే రాముకు వివరించారు. ప్రజా ప్రతినిధిగా గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేసే సర్పంచ్ సురేఖ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు. సురేఖ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ జోన్స్ దయానంద్, దొండపాడు గ్రామ వైస్ సర్పంచ్ శీను, టిడిపి నాయకులు చోరగుడి సుధాకర్, గుత్తా వెంకటేశ్వరరావు, లింగమనేని శివరావు, గద్దె వెంకటరావు, చోడగుడి రాజారావు, వల్లూరి అబ్బులు, ఉప్పలపాటి పాపయ్య, మెరుగుమాల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మద్యం కుంబకోణం అసలు సూత్రదారులు జైలుకు వెళ్లటం ఖాయం

- జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి....
- మద్యం కుంబకోణంలో వాస్తవాలు దాచి అవాస్తవాల ప్రచారం

**చిలకలూరిపేట, ఆకాంక్ష :** మద్యం కుంభకోణం కేసులో అసలు సూత్రధారులు, పాత్ర దారులు త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మద్యం కుంభకోణంలో జగన్ అండ్ కో జేబులు నింపుకోవటంతో అప్పటి ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిందని, కేవలం మద్యంలోనే రూ.32 వేల కోట్ల అవినీతి జరిగిందని ఇప్పటికే అధికారులు లెక్కలు తేల్చారని వెల్లడించారు. దాదాపు 300 బ్రాండ్ల మద్యం ఇప్పుడు అందుబాటులో ఉంటే జగన్ హయాంలో మాత్రం కేవలం 43 బ్రాండ్ల నాసిరకం మద్యం మాత్రమే ఉంచారని. నాసిరకం మద్యం తాగి అనేక మంది అభాగ్యులు మృత్యువాత పడ్డారని, ఈ మరణాలపై కూడా విచారణ నిర్వహించాలని బాలాజి కోరారు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు నుంచి అధికారుల వరకు పెద్ద స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ లిక్కర్ స్కాం మొత్తం బయటపడేసరికి అబద్దాల ప్రచారంతో మభ్యబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ తన మీడియా ద్వారా వాస్తవాలను మరుగు పరిచే ప్రయత్నం చేస్తున్నారని, అయితే ప్రజలు నీలి మీడియా రాతలను నమ్మరని తెలిపారు. జగన్ పాలనలో మద్యం రోగుల సంఖ్య, మద్యం మరణాలు గతం కన్నా రెట్టింపు ఎందుకు పెరిగాయి?నాసిరకం మద్యం వల్ల కాదా? అని ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో ప్రధాన లబ్ధిదారు త్వరలోనే బయట వస్తారని తెలిపారు. కమీషన్లు ఇచ్చినందుకే కదా నాసిరకం బ్రాండ్లు అనుమతించింది?, కమీషన్ల కోసం కాదా నాసిరకం మద్యం ధరలు రెట్టింపు చేసి పెంచింది?, కమీషన్ల కోసమే కదా డిజిటల్ పేమెంట్స్ కాకుండా నగదు చెల్లింపుల ద్వారా అమ్మకాలు చేసింది?

కమీషన్లు రూ.3,200 కోట్లకు సిట్ ఆధారాలు సేకరించినందుకే కదా ఈడీ కేసు నమోదు చేసింది? అని ప్రశ్నించారు. లిక్కర్ స్కాం మొత్తం బయటపడేసరికి అబద్దాల ప్రచారంతో మభ్యబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని, కాని చట్టం తన పనితాను చేసుకుపోతుందని, సూత్రధారిని త్వరలోనే అరెస్టు చేస్తారని బాలా తెలిపారు.

# ఘనంగా మినీ మహానాడుకార్యక్రమం పాల్గొన్న కదిరి శాసనసభ్యులు,నియోజకవర్గఅబ్జార్వర్ వాహిద్ హుస్సేన్



**తనకల్లు, ఆకాంక్ష :** కదిరి పట్టణం మదనపల్లి రోడ్డు పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు కదిరి నియోజకవర్గం శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న మినీ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న కదిరి నియోజకవర్గ అబ్జర్వర్ వహీద్ హుస్సేన్, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప , రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి పి.వి.పవన్ కుమార్ రెడ్డి,కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్,మున్సిపల్ చైర్మెన్ దిల్షాద్ వున్నీషా,వైస్ ఛైర్మన్లు షేగూ సుధారాణి, రాజశేఖర్ ఆచారి , మహిళా నాయకులు పర్వీన్ బాను,కదిరి పట్టణ కౌన్సిలర్లు,వార్డు ఇంచార్జీలు,మండల కన్వీనర్లు,క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలు,నాయకులు కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు,పెద్దయెత్తున పాల్గొన్నారు

# మానసిక వికలాంగుల పిల్లల పునరైక్యం లో మరో విజయవంతమైన మానవీయ ప్రవర్తన



**విజయవాడ, ఆకాంక్ష :** నాలుగు సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్ జిల్లా నుండి షేక్ కరీం, మరియు సంవత్సరం క్రితం అన్నమయ్య జిల్లా నుండి కనుగొండ యువరాజు గుర్తుతెలియని పరిస్థితుల్లో మిస్ అయిన ఇద్దరు మానసిక వికలాంగ పిల్లలు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని నూతన్ జీవన్ బాలభవన్ మానసిక వికలాంగుల ఆశ్రమంలో సంరక్షణకు పంపించబడ్డారు.ఈ రెండు కేసులలోగా పిల్లలు ఆధార్ కార్డులు కలిగి ఉన్నప్పటికీ, మానసిక పరిస్థితుల కారణంగా వారి బయోమెట్రిక్స్ (ఐరిష్, వేలిముద్రలు) సరిగా పనిచేయకపోవడం, అలాగే ఆధార్‌కు లింకైన మొబైల్ నంబర్లను గుర్తించలేకపోవడం వల్ల ఆధార్ డౌన్లోడ్ చేయడంలో అపారమైన సవాళ్లు ఎదురయ్యాయి. అయితే, ఎన్టీఆర్ జిల్లా డిసిపియు రక్షణ అధికారి సంస్థాగత సంరక్షణ రక్షణ అధికారి వానపల్లి దుర్గా ప్రసాద్ , సంబంధిత చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ సహకారంతో నిబద్ధతతో పని చేసి, అవసరమైన ఆధారాలను సమకూర్చి వారి తల్లిదండ్రుల వివరాలను గుర్తించారు. తల్లి%-%తండ్రులకు సమాచారం ఇచ్చిన తరువాత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు వారిని అధికారికంగా తల్లిదండ్రులకు అప్పగించారు.ఈ మానవీయ విజయం మరోసారి డిసిపియు మరియు చైల్డ్ కేర్ సిబ్బంది నిబద్ధతకు, శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇటువంటి విజయవంతమైన పునరైక్యాలు దేశవ్యాప్తంగా బాలల హక్కుల పరిరక్షణకు మార్గదర్శకంగా నిలవాలని ఆశించదగినది అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ కే సువార్త అన్నారు.

# ఒలింపిక్ పతకం సాధనే లక్ష్యం కావాలి:జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- వోల్గా ఆర్చరీ అకాడమీకి పీ4 స్ఫూర్తితో క్రీడా పరికరాలు.....
- మార్గదర్శిగా అమరావతి బోటింగ్ క్లబ్...

**విజయవాడ,ఆకాంక్ష :** విలువిద్యలో క్రీడాకారులకు మరింత నైపుణ్యాలను అందించి.. వచ్చే ఒలింపిక్ క్రీడల్లో వోల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాన్ని సాధించడమే లక్ష్యంగా శిక్షణ అందించి.. నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, పీ 4 విధానం స్ఫూర్తితో క్రీడా పరికరాలను అందించేందుకు ముందుకొచ్చిన అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులను అభినందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.మంగళవారం కలెక్టరేట్‌లో వోల్గా ఆర్చరీ అకాడమీకి రూ. 1.16 లక్షల విలువైన ఆర్చరీ ఉపకరణాలను అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్ లక్ష్మీశ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనదగ్గర ప్రతిభ ఉన్న విలువిద్య క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని.. వారికి మరింత నాణ్యమైన శిక్షణ అందిస్తే ఒలింపిక్‌తో పాటు వివిధ అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించే సత్తా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని వోల్గా ఆర్చరీ అకాడమీకి అమరావతి బోటింగ్ క్లబ్ మార్గదర్శిగా సహాయం అందించినట్లు తెలిపారు. ఆర్చరీ అకాడమీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా శిక్షణ అందిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తోందని.. ఈ నేపథ్యంలో బంగారు కుటుంబమైన అకాడమీకి సహాయమందించేందుకు బోటింగ్ క్లబ్ ముందుకొచ్చినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) సీఈవో తరుణ్ కాకాని, వోల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ నేషనల్ కమిటీ సభ్యులు బీవీ రమణ, జిల్లా ట్రెజరర్ జి.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేందుకు కృషి చేయాలి

## రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ గ్రీవెన్స్ అధికారి( సి జి ఓ) చిన్నారావు.....

**మచిలీపట్నం, ఆకాంక్ష :** సామాన్యుని సమస్యను సానుభూతితో ఓపికగా ఆలకించి పరిష్కరించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ విధానమని, జిల్లాలో పనితీరు మెరుగుపరుచుకుని ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ గ్రీవెన్స్ అధికారి( సి జి ఓ) చిన్నారావు అధికారులకు సూచించారు.మంగళవారం ఉదయం ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కృష్ణాజిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) ు మీకోసం కార్యక్రమం, అర్జీల పరిష్కారం, ప్రజల్లో సంతృప్తి స్థాయి తదితర అంశాల పై జూమ్ ద్వారా శిక్షణతో పాటు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిజిఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల సంతృప్తి చాలా ముఖ్యమన్నారు.ప్రతి ఒక్క అధికారి సామాన్యుని మాట వినిపించుకోవాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు.సాటి మనిషి పైన కాస్త దయ, సానుభూతి చూపాలని పౌరులకు సేవ చేయడానికి మించినది ఏమీ లేదని స్పష్టం చేశారు.గతంలో కృష్ణాజిల్లా ప్రజా సమస్యల పరిష్కారంలో పనితీరు బాగుండేదని ప్రస్తుతం బాగా వెనుకబడిందన్నారు.సమస్యలు పరిష్కరించిన అర్జీదారులతో నేరుగా మాట్లాడటం జరుగుతుందని వారి సమస్య ఏ మేరకు పరిష్కారం అయిందో అభిప్రాయం అడిగి తెలుసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఉంగుటూరు, గూడూరు మండలాల్లో ప్రజల సంతృప్తి స్థాయి చాలా బాగుందంటూ ఏ విధంగా ప్రజలతో మాట్లాడేవారో సంబంధిత తహసీల్దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే జిల్లా పౌరసరఫరాల అధికారి పని తీరు కూడా చాలా బాగుందని పేర్కొంటూ డీఎస్ఓ పార్వతితో ఎలా సాధించగలిగారు వివరాలు అడిగి తెలుసుకున్నారు.వారంతా అర్జీదారులతో ఎంతో ఓపికగా సానుకూలంగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకుని సావధానంగా సమాధానం చెప్పడం వల్ల అది సాధ్యమైందని వారు సిజిఓకు వివరించారు. ఏ అధికారైన తమ వద్దకు అర్జీదారుడు వచ్చినప్పుడు తాము ఎంత పని వత్తిడిలో ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా కొంత సమయం వారికి కేటాయించి మాట్లాడినప్పుడు ప్రజల్లో సంతృప్తి వస్తుందన్నారు. విచారణకు వెళ్లే కింది స్థాయి ఉద్యోగులు అర్జీదారులతో ఏం మాట్లాడుతున్నారో సంబంధిత శాఖ పరిష్కార అధికారికి తెలియడం లేదన్నారు. ఆ ఉద్యోగులు సావధానంగా మాట్లాడకపోవడం వల్ల సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. అటువంటి చిన్న చిన్న తప్పులు జరుగుతున్నాయని, లోపాలు ఉంటున్నాయని వాటిని సరి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అర్జీదారులతో ప్రేమాభిమానంతో మాట్లాడాలని ఇకనైనా ఉద్యోగులలో మార్పు రావాలన్నారు. ముఖ్యంగా అర్జీదారులకు వీలున్నంతవరకు సహాయం చేసే విధంగా పనిచేయాలన్నారు.ప్రతి ప్రభుత్వ శాఖలో ఉన్నతాధికారులు వారికి సంబంధించిన అర్జీలు ఎలా



పరిష్కరిస్తున్నారో సరిగా ఆడిట్ చేయకపోవడం వల్లనే ప్రజల్లో సంతృప్త స్థాయి తగ్గిపోవడానికి కారణం అవుతూ ఉందన్నారు. కృష్ణాజిల్లాలో తోట్లవల్లూరు, అవనిగడ్డ, నాగాయలంక, పెనమలూరు, నందివాడ తదితర మండలాల్లో ప్రభుత్వ పాలనపట్ల ప్రజల్లో అసంతృప్తి స్థాయి ఎక్కువగా ఉందన్నారు. అక్కడ మండల ప్రత్యేక అధికారులను చొరవ చూపి మండలాధికారుల పనితీరులో మార్పు వచ్చేలా చేసి ప్రజల సంతృప్తి సాయి పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఏ పనైనా చేయగలిగితే వెంటనే చేయాలని లేని పక్షంలో ఎందుకు వీలు కాలేదు కారణాలు అర్థమయ్యే విధంగా తెలియజేస్తూ అర్జీదారునికి తెలియజేయాలన్నారు.జిల్లాలో ప్రభుత్వ శాఖలు మండలాల పనితీరు ఎలా ఉందో విశ్లేషణ నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేస్తున్నామన్నారు.మరల వచ్చే నెల ఇదే తేదీన సమీక్షిస్తామని ఆలోగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పనితీరులో మార్పు తెచ్చుకొని ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ నగరంలోని కలెక్టరేట్ విసీ హాల్ నుండి పాల్గొని మాట్లాడుతూ చాలా ప్రభుత్వ శాఖల్లో పనితీరు సరిగా లేదని ప్రజల్లో సంతృప్తి స్థాయి చాలా తక్కువగా ఉందని ఇకనైనా పనితీరు మార్చుకొని ప్రజల్లో సంతృప్త స్థాయిని మరింత పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారులతో ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నేరుగా కాల్ సెంటర్ 1100 నెంబర్ నుండి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారని దాని విశ్లేషణ ఆధారంగా ప్రభుత్వ శాఖల అధికారుల కు ర్యాంకింగ్ ఇస్తున్నారన్నారు. ఇకనైనా ప్రజా సమస్యల పట్ల వెంటనే స్పందించి వారితో సానుకూలంగా మాట్లాడి అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో ప్రజల సంతృప్తి స్థాయి చాలా కీలకమని అన్నారు.మండలాల్లో పరిపాలన విధానం బాగాలేదని ప్రజలు చెబుతున్నట్లు నివేదికలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే జూన్ మాసం 12వ తేదీ నుండి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతున్నాయి, ప్రజల సమస్యలు పరిష్కారంలో మీకోసం కార్యక్రమం ఏ మేరకు సేవలు అందిస్తోంది, ప్రజల సంతృప్తస్థాయి ఎంత మేరకు ఉంది అనే అంశాలను ముఖ్యమంత్రి పరిశీలిస్తారన్నారు. ప్రజల సంతృప్తి మేరకు వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయా లేదా అని విచారిస్తారన్నారు.ప్రజల సమస్యలు సానుకూలంగా పరిష్కారం అవుతున్నాయా లేదా ఏమైనా సమస్యలు ఉన్న చట్టపరిధిలో వీలుకాకుంటే ఆ విషయాలను ప్రజలకు సజావుగా వారికి అర్థమయ్యే రీతిలో తెలియజేస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీస్తారన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నేరుగా అర్జీదారులకు ఫోన్లు చేయడం జరుగుతుందని ఇంటికి ఎవరైనా అధికారులు వచ్చారా లేదా విచారణ జరిపారా లేదా వారి పని పూర్తి అయిందా లేదా కాకుంటే అధికారుల స్పందన ఎలాగుంది అనే వివరాలను అడిగి తెలుసుకుంటున్నారన్నారు .విచారణకు వెళుతున్న కిందిస్థాయి ఉద్యోగులు అర్జీదారులతో సావధానంగా మాట్లాడటం లేదని కొంతమంది మరి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని వారిలో సరైన స్పందన ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.విచారణ ఉద్యోగులు వారితో మాట్లాడిన విషయాలను రికార్డు చేసి మరి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని, ఇకనైనా అధికారులు తమ పనితీరు, మాట తీరు, ప్రవర్తన మార్చుకొని సజావుగా నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరి సమస్యలు తీర్చలేమని ఆ విషయం సానుకూలంగా చెప్పాల్సి ఉందన్నారు. ముఖ్యంగా విచారణకు వెళ్లే కిందిస్థాయి ఉద్యోగులకు అర్జీదారులతో మర్యాదపూర్వకంగా ఎలా మాట్లాడాలో తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎక్కువగా పోలీసు, రెవెన్యూ శాఖలపై ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. అర్జీదారునికి అర్జీదారునితో నేరుగా మాట్లాడి వారి సమస్యను సానుకూలంగా తెలుసుకొని ఫోటో తీసుకోవాలని, అర్జీ పై తగిన చర్యలు తీసుకొని సమాధానం నేరుగా గాని, వీలుకానిపక్షంలో వాట్సఅప్ ద్వారా గాని పంపాలన్నారు. సమాధానం వారికి అందినట్లుగా రసీదు పొందాలన్నారు.ఒకవేళ పరిష్కరించిన అర్జీ మరల వచ్చినట్లయితే అందులోని తప్పులను గమనించి సరిదిద్దుకొని సరైన చర్యలు తీసుకుంటే ప్రజలలో సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు వారి కింది స్థాయి ఉద్యోగులు ఏ విధంగా సమస్యను పరిష్కరించారో ఒకసారి సంబంధిత అర్జీదారులతో మాట్లాడి తెలుసుకున్నాకనే వారికి సమాధానం పంపాలన్నారు.కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ మీకోసం కార్యక్రమం నిర్వహించినప్పుడు జిల్లా మండల స్థాయిలో డివిజన్ మండల స్థాయిలో ప్రజల నుండి అర్జీలు వస్తుంటాయని వాటితో పాటు ప్రజాప్రతినిధుల నుండి, రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించే ప్రజావేదిక నుండి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి కూడా అర్జీలు వస్తుంటాయన్నారు. అర్జీదారులు వచ్చినప్పుడు వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యను ఎంతో ఓపికగా పూర్తిగా వినాల్సి ఉంటుందన్నారు. అర్జీదారుని స్థానంలో మనం ఊహించుకొని వారి బాధను మన బాధగా భావించి వారి సమస్యను పరిష్కరించాలన్నారు.సంబంధం లేని అర్జీ ఏదైనా ఒక ప్రభుత్వ శాఖ అధికారికి వస్తే కాలం వృధా చేయకుండా వెంటనే అది వారి పరిధిలో లేదని సంబంధిత అర్జీదారునికి తెలియజేయాల్సి ఉందన్నారు.కొంతమంది అధికారులు ఆన్లైన్లో వచ్చిన అర్జీలను సరిగా చూడటం లేదని వెంటనే వాటిని చూసి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.విచారణకు వెళ్లే అధికారి గాని ఉద్యోగి గాని సంబంధిత అర్జీదారునికి ముందుగా సమాచారం అందించాలని, విచారించాక అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో తెలుగులోనే సమాధానం సంబంధిత విఆర్ఓ లేదా సచివాలయము సిబ్బంది, సంబంధిత శాఖల సిబ్బంది ద్వారా పంపాలన్నారు. వారు వేరే ప్రాంతాల్లో నివసిస్తున్నట్లయితే రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపాలన్నారు.ముఖ్యంగా పోలీసు శాఖ నుండి సమాధానాలు ఆంగ్ల భాషలో వస్తున్నాయని ఇకనుంచి తెలుగులో పంపేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఏదైనా అధికారికి అర్జీ వచ్చినప్పుడు అది వారి పరిధిలో పరిష్కారం చేయగలిగితే వెంటనే చేయాలని, చట్టపరిధిలో అర్హతలు లేక చేయలేకపోతే అందుకు గల కారణాలను వివరిస్తూ వారితో మాట్లాడి సమాధానం పంపాలన్నారు.సంబంధిత అధికారికి తెలిసే ఏదైనా సమస్య పరిష్కారం కావాలని క్రింది స్థాయి ఉద్యోగులకు ఏమాత్రం అప్పగించరాదన్నారు. ఒకే విషయం పైన మరల అర్జీ పెట్టుకునే పరిస్థితి రాకుండా సమాధానం సరిగా సంబంధిత అర్జీదారునికి పంపాలన్నారు. ఈ జూమ్ శిక్షణ సమావేశంలో డీఎస్ఓ పార్వతి, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ వాణి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, పౌరసరఫరాల సంస్థ డిఎం శిరీష, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజా, డి ఆర్ డి ఎ పి డి హరిహరనాధు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నాగరాజు,మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డీఈవో రామారావు, ఆర్టిఓ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# దేశ రక్షణకు అంకితమైన సైనిక సంక్షేమంలో భాస్వాములు కండి.:జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

## సైనిక సంక్షేమ నిధికి సహాయం సామాజిక బాధ్యత....

**విజయవాడ, ఆకాంక్ష :** దేశం కోసం ఆహర్నిసలు సేవలు అందిస్తూ విధి నిర్వహణలో అటుపోట్లను ఎదుర్కొంటున్న సైనికుల సంక్షేమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని సైనిక సంక్షేమ నిధికి సహాయం అందించడం సామాజిక భాధ్యతగా భావించి విరాళం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. సైనిక సంక్షేమ నిధికి విరాళంగా కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ప్రతినిధులు అందించిన లక్ష రూపాయల చెక్కును మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆయన ఛాంబర్‌నందు జిల్లా సైనిక సంక్షేమ అధికారి లెఫ్టనెంట్ కమాండర్ డా. కె. కళ్యాణ వీణకు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఆహర్నిశలు పోరాడి అమర వీరులైన సైనిక కుటుంబాలను ఆదుకోవాల్సిన భాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ప్రతినిధులు సామాజిక భాధ్యతగా లక్ష రూపాయల విరాళాన్ని సైనిక సంక్షేమ నిధికి విరాళంగా అందించడం వారి దాతృత్వానికి నిదర్శనం అన్నారు. దేశ రక్షణ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారత జవానుల ధైర్యసహసాలు తెగువకు జాతి యావత్తు గర్విస్తుందన్నారు. ఇటీవల పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి ప్రతికారంగా మన సైనికులు పోరాడిన తీరు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నేడు మనం స్వేచ్ఛంగా జీవించగలుగుతు న్నామంటే అందుకు కారణం భారత సైనికుల రక్షణే కారణమన్నారు. దేశ రక్షణకి పాటుపాడుతున్న ప్రతి సైనికునికి మనం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. వీర మరణం పొందిన సైనికుల తల్లిదండ్రులకు, వితంతువు అయిన భార్యకు అనాదులైన పిల్లలకు మనకు తోచిన రీతిలో స్పందించి విరాళాలు అందించడం ద్వారా కొంత మేరకు లోటు తీర్చగలిగే అవకాశం ఉంటుందన్నారు. సైనిక సంక్షేమ నిధికి సహాయం అందించేందుకు ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికార సర్జన్ లెఫ్టనెంట్ కమాండర్ డా. కె. కళ్యాణ వీణ, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ జనరల్ మేనేజర్ కె.వి. మారుతిరావు, జిల్లా క్లస్టర్ హెడ్ టి. రామకృష్ణలు పాల్గొన్నారు.



# భారీ వర్షాలపై అధికారులను అప్రమత్తం చేశాం:జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు

### ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా సమాచారమివ్వండి



**విజయవాడ, ఆకాంక్ష :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, మునిసిపల్, వ్యవసాయ తదితర శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 9154 970 454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ) ఏర్పాటు చేశామని.. ప్రజలు తమకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఈ నంబరులో సంప్రదించి, సమాచారమివ్వాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా, సరఫరాలో ఆటంకం లేకుండా పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, నిరంతరం పరిస్థితిని సమీక్షించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా.. రోడ్లపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపేందుకు అవసరమైన సిబ్బంది, ఇంజిన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా చెట్లు కూలితే వెంటనే తొలగించేలా ఆదేశాలిచ్చామన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని.. చెట్ల కింద నిలుచోవడం వంటివి చేయొద్దని, వాహనాలను భద్రమైన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని, వర్షాలు పడే సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సహాయక చర్యలు అవసరమైనా చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంటల రక్షణకు సంబంధించి తగు సూచనలు చేయాలన్నారు. ఒకవేళ విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే వెంటనే పునరుద్ధరించి, సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# బసంత్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద లారీ యజమానుల ధర్నా...



**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద లారీ యజమానులు భారీ స్థాయిలో మహా ధర్నా నిర్వహించారు. 20 కిలోమీటర్ల పరిధిలో ప్రాదేశిక లారీల నుండి టోల్ వసూలు చేయడాన్ని నిరసిస్తూ, హెచ్‌కేఆర్ యజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.లారీ యజమానులు టోల్ వసూలును నిలిపివేస్తూ ప్లాజాను స్తంభింపజేశారు. గత రెండు రోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతుండగా, ఈరోజు వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తపరిచారు. హెచ్‌కేఆర్ యజమాన్యం గత 12 సంవత్సరాలుగా నిరంతరం టోల్ వసూలు చేస్తున్నప్పటికీ, హైవేపై కనీస సౌకర్యాలు లేవని వారు ఆరోపించారు. టోల్ మాఫీ చేయకుంటే నిరవధిక నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ఇదే క్రమంలో, హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు, పచ్చదనం (గ్రీనరీ), అంబులెన్స్, రెస్ట్ రూములు, మెడికల్ సౌకర్యాల ఏర్పాటును డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బయ్యపు మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పాలకుర్తి మండల అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ పాల్గొన్నారు. రామగుండం ప్రాంతానికి చెందిన లారీ యజమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

# గోదావరిఖనిలో నాగులమ్మ దేవస్థాన సందర్శన చేసిన మనాలి ఠాకూర్



**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ గోదావరిఖనిలోని పవర్ హౌస్ కాలనీలో ఉన్న పురాతన నాగులమ్మ దేవస్థానాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తరువాత, గోదావరిఖని మున్నూరు కాపు సంఘం సభ్యులతో సమావేశమై సంఘానికి చెందిన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. స్థల అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు వినతిని అందజేశారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, మక్కాన్ సింగ్ సేవ సమితి ద్వారా అన్ని విధాల సహకారం అందించి సంఘ అభివృద్ధికి తోడ్పడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చట్టాన్ని ఉల్లంఘిస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు:జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేయాలి ▪ క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**విజయవాడ, అమరావతి:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ-పీఎన్‌డీటీ) చట్టాన్ని ఉల్లంఘిస్తే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని.. సమన్వయ శాఖల అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ-సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ ఎ.సత్యానంద్ హాజరైన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు




చేయాలని, ఫిర్యాదులు వస్తే వాటిని త్వరితగతిన విచారించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతమున్న స్కానింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త రిజిస్ట్రేషన్లకు సంబంధించిన తొమ్మిది దరఖాస్తులను, మూడు రెన్యువల్ దరఖాస్తులను, నాలుగు క్యాన్సిలేషన్ దరఖాస్తులను కమిటీ పరిశీలించి, చర్చించి, ఆమోదం తెలిపింది. అదేవిధంగా ఏఆర్‌టీ లెవెల్-1 కేటగిరీకి సంబంధించిన రెండు దరఖాస్తులు, ఏఆర్‌టీ లెవెల్-2 కేటగిరీకి సంబంధించిన రెండు దరఖాస్తులతో పాటు సరోగసీ క్లినిక్‌కు సంబంధించి ఒక దరఖాస్తుకు కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మీ, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డా. పద్మజ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డా. నవీన్ తదితరులు పాల్గొన్నారు

# క్యాంపెనింగ్ పేరుతో ప్రైవేట్ టీచర్లకు టార్గెట్లు

- మొదలైన పాఠశాలల అడ్మిషన్లు...
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్...
- కార్పొరేట్ విద్యాసంస్థల మధ్య పోటీలు నలిగిపోతున్న టీచర్లు...

**హన్మకొండ (ఆకాంక్ష న్యూస్) :** విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకుండానే ఉపాధ్యాయులను, అధ్యాపకులను ప్రైవేట్ విద్యా సంస్థలు వేధిస్తున్నాయి. మండుటెండల్లో ఇంటింటి ప్రచారం చేసి విద్యార్థులను చేర్పించాలని ఒత్తిడి చేస్తున్నాయి. అడ్మిషన్లను తీసుకు రాకుంటే జీతాలు ఇవ్వబోమని హెచ్చరిస్తున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల తీరుతో ప్రైవేట్ టీచర్లు మనోవేదనకు గురి అవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక పీజి, డిగ్రీ, బీ ఈడీ చేసిన ఎంతోమంది జీవనం సాగించడానికి ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పని చేస్తున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థుల ప్రవేశాలకు టార్గెట్ విధిస్తూ యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో వందలాదిగా వెలిసిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థలు నెలరోజులుగా ఆయా పాఠశాలలు కళాశాలల్లోని ఉపాధ్యాయులను ఇంటింటికి తిప్పుతున్నారు. వారు ప్రతీ ఇంటికి వెళ్లి మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా, వారు ఏం చదువుతున్నారు అనే సమాచారం సేకరిస్తున్నారు. వారిని తమ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించండి అని తల్లితండ్రులను బ్రతిమాలుతూ కోరుతున్నారు. ఇచ్చిన ప్రవేశాల టార్గెట్లు పూర్తి చేస్తేనే వేసవి సెలవుల్లో జీతాలు ఇస్తామని కొన్ని విద్యాసంస్థలు నిభందనలు పెడుతున్నాయి. ఒక్కొక్కరు కనీసం పది నుండి పదిహేను మందిని చేర్పించాలని లక్ష్యం పెడుతున్నారు. అలా చేర్పించిన తరువాత కూడా సెలువుల అనంతరం విద్యాసంస్థలు తెరిచాక కూడా వారి ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందా తెలియని అయోమయంలో ఉంటున్నారు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపి వేస్తారని భయంతో ఉపాధ్యాయులు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. భగభగ మండుతున్న ఎండల్లో ఇంటింటికీ తిరుగుతూ చెమటలు కక్కుతున్నారు. ఒకవైపు బోధన మరోవైపున అడ్మిషన్లకు టార్గెట్ పూర్తి చేసే పనిలో ప్రైవేట్ కార్పోరేట్ ఉపాధ్యాయులు అధ్యాపకులు తీవ్రమైన ఒత్తిడికి లోనై మానసికంగా శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. తమ ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోనే మదన పడుతూ కుమిలిపోతున్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న సమయంలో ఉన్న ఉద్యోగాల్ని వదులుకోలేక, ఒత్తిడికి తట్టుకోలేక వారు పడుతున్న బాధలు వర్ణించ లేక పోతున్నారు. చాలీచాలని జీతాలు చెల్లిస్తూ విద్యాసంస్థల యజమాన్యాలు వారితో చెలగాటం ఆడుతున్నారు. ప్రాథమిక స్థాయిలో బోధించే వారికి తక్కువ జీతాలను ఇస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు. టార్గెట్లు పూర్తి చేయని వారిని నోటికొచ్చినట్లు తిట్టి తమ మనోభావాలు దెబ్బ తీస్తున్నట్లు టీచర్లు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.








# హైదరాబాద్‌లో దళిత సంఘాల మహాధర్నా...

### ఎంపీ గడ్డం వంశీకృష్ణ విస్మరణపై తీవ్ర ఆగ్రహం...

**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక ప్రచార పత్రికలు, ఫ్లెక్సీల్లో దళిత వర్గానికి చెందిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫోటోను చేర్చకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై నిరసనగా అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాలు ఉమ్మడిగా భారీ మహాధర్నా నిర్వహించాయి.ధర్నా సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ, “ఇది కేవలం ఒక ఫోటో విస్మరణ కాదు, దళితుల గౌరవాన్ని దారుణంగా తుంచేసే చర్య. ఇది సామాజిక న్యాయానికి, సమానత్వానికి కొరడా” అని విమర్శించారు. దళిత సంఘాలు ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తూ, వెంటనే ఈ విస్మరణకు కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య, మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని సంఘాలు స్పష్టం చేశాయి. “ఎంపీ వంశీకృష్ణ ఫోటోను అధికారిక ప్రచారంలో చేర్చకుండా చేయడం ప్రణాళికాబద్ధమైన బహిష్కరణ. వెంటనే మంత్రి శ్రీధర్ బాబు రాజీనామా చేయాలి,” అంటూ తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తం చేశారు.ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం కాదు, దళితుల పట్ల ఉన్న ఓ చీకటి మనస్తత్వానికి నిదర్శనం. అలాంటి వ్యవస్థను తడిమి నిలిపేందుకు మేము సిద్ధంగా ఉన్నాం,” అని వారు హెచ్చరించారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, వెంటనే స్పందన రాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, సామాజిక సమానత్వం కోసం శక్తివంచన లేకుండా పోరాడతామని స్పష్టం చేశారు. “జస్టిస్ ఫర్ దళిత్ %-% జై భీమ్” నినాదాలతో కూడిన ఈ మహాధర్నా, ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచే దిశగా మైలురాయిగా నిలిచింది.

# రానున్న 4 లేదా 5 రోజుల్లో.. కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

**న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** నైరుతి రాకపై ఐఎండీ ఇవాళ మరో అప్‌డేట్ ఇచ్చింది. రానున్న 4 లేదా 5 రోజుల్లో.. నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ ఒకటో తేదీన నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయి. ఇక ఈ యేడాది మే 27వ తేదీ వరకు నైరుతి కేరళ చేరనున్నట్లు కొన్ని రోజుల క్రితం ఐఎండీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఒకవేళ అనుకున్నట్లు నైరుతి కేరళకు వస్తే, 2009 తర్వాత కేరళకు నైరుతి చాలా ముందుగా వచ్చినట్లు భావిస్తున్నారు. రాబోయే 4, 5 రోజుల్లో కేరళను నైరుతి తాకే సందర్భాలు అనుకూలంగా ఉన్నట్లు ఇవాళ భారతీయ వాతావరణ శాఖ తెలిపింది.అనుకున్న దానికన్నా ముందే నైరుతి రుతుపవనాలు కేరళ తీరంతో పాటు దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతాలకు చేరనున్నట్లు తెలుస్తోందని ఐఎండీ పేర్కొన్నది. కేరళలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురిశాయి. ఇవాళ త్రిసూర్ జిల్లాలో 22 సెమీ వర్షపాతం నమోదు అయ్యింది. కన్నూరు



జిల్లాలో 18 సెమీ వర్షం కురిసింది.

# నైపుణ్యాభివృద్ధికి శిక్షణతో ఉపాధికి బాటలు: మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు





**రామగిరి (ఆకాంక్ష న్యూస్) :** రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న ఉద్దేశంతో సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంగళవారం రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా యువత ఉద్యోగ అవకాశాలను సాధించగలదని తెలిపారు. ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. శిక్షణ పొందే అభ్యర్థులు కేవలం సర్టిఫికెట్ కోసమే కాకుండా, నిజమైన నైపుణ్యాన్ని సంపాదించాలని సూచించారు. 38 రకాల కోర్సులతో శిక్షణ ఈ కేంద్రంలో సుమారు 38 కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సర్వే నిర్వహించి, యువతకు వారి నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ నిరుద్యోగ యువత కోసం చేస్తున్న ఈ విధమైన శిక్షణా కార్యక్రమాలు అభినందనీయమని, ఈ కేంద్రాన్ని భవిష్యత్తులో ఉద్యోగాల నియామక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా స్థానిక యువత ఉపాధి అవకాశాలను వినియోగించుకుని, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర ప్రభుత్వ అధికారులు, సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరుపై
# సానుకూలంగా స్పందించిన మంత్రులు

## రాష్ట్ర రెవెన్యూ, ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రులకు టీయుడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో వినతి పత్రాలు





**పెద్దపల్లిప్రతినిధి (ఆకాంక్ష న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసే విషయమై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. మంగళవారం జిల్లాలోని ఎలిగేడు మండలం ముప్పిరితోటలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన మంత్రులకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. జిల్లాలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తున్న విధంగా 250 గజాల ప్రభుత్వ స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే జర్నలిస్టుల కోసం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకానికి బదులు రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని, వివిధ కారణాల వల్ల మృతి చెందే జర్నలిస్టులకు రైతు బీమా వలే రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలనీ కోరారు. అక్రిడిటేషన్ కార్డు గల జర్నలిస్టులందరికి ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణించేందుకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే విధంగా చొరవ చూపాలని, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50 నుంచి 75% వరకు రాయితీ కల్పించాలని, జిల్లా కేంద్రంతో పాటు మంథని, సుల్తానాబాద్, ఆయా మండల కేంద్రాల్లో ప్రెస్ భవన్ ల కోసం ప్రభుత్వ స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తప్పకుండా మీ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.

### ఇళ్ల స్థలాలపై కలెక్టర్కు ఫోన్ చేసిన మంత్రి శ్రీధర్ బాబు..

జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు గాను తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు గాను ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో గుర్తించాలని శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు ఫోన్ చేసి ఆదేశించారు. స్థలాలు గుర్తించగానే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరుతామని, ఈ విషయమై పెద్దపల్లి, రామగుండం శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు, రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ కలిసి మాట్లాడుకుని తమ సమస్యను పరిష్కరిస్తామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుర్రసంపత్ కుమార్ గౌడ్, రాష్ట్ర మఫిషియల్ కమిటీ సభ్యులు సామల హరికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమూర్తి యాదవ్, భూకల సారయ్య, సీనియర్ జర్నలిస్టులు గుడ్ల శ్రీనివాస్, కేతిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మల్లేష్ యాదవ్, కల్వల శంకర్, తిరుపతి గౌడ్, లక్ష్మీపతి, అశోక్, సతీష్ రెడ్డి, రంజిత్, నాగపురి తిరుపతి, జె లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు రోజులు తెలంగాణలో వర్షాలు



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణలో రాగల నాలుగు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ద్రోణి ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాబోయే మూడురోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది ఐఎండీ. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాల్లో అక్కడక్కడ 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ వానలు పడుతాయని చెప్పింది. అలాగే, ఈ నెల 23, 24 తేదీల్లో ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్నగర్ జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ వివరించింది.

# తమ సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్ల భిక్షాటన...

**చిగురుమామిడి(ఆకాంక్ష న్యూస్) :** దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక సంఘాల నిరసనలలో భాగంగా, చిగురుమామిడి మండల కేంద్రంలో ఆశా వర్కర్లు వినూత్నంగా భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు బస్టాండ్ ప్రాంతంలో ప్రజల ముందు భిక్షాటన చేస్తూ వినూత్న నిరసనకు పాల్పడ్డారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ, "మా వేతనాలు అత్యంత తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ సేవల్లో పని చేస్తున్నా, మాకు కనీస ఉద్యోగ హోదా లేదు. మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఆహార భద్రత వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని" వారు డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని, ఆశా వర్కర్ల వేతనాలను గణనీయంగా పెంచాలని ప్రభుత్వాన్ని ఆహ్వానించారు. ప్రభుత్వ హామీలు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, తమ హక్కుల కోసం నిరంతరంగా పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ వినూత్న భిక్షాటన నిరసన చిగురుమామిడి మండలంలో ఆసక్తికరంగా మారింది. ప్రజలు ఆశా వర్కర్ల పోరాటాన్ని గమనించి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మారేళ్ల శ్రీలత, బెజ్జంకి సరోజన, బండారు సరోజన, పుష్ప, అంజలి, కవిత, తార, శ్వేత, సాహిదా బేగం, మంజుల, తిరుమల తదితర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# అమంగల్లో ఆటో రథయాత్రకు ఘన స్వాగతం




**రంగారెడ్డి(ఆకాంక్ష న్యూస్) :** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని అమంగల్ మున్సిపాలిటీ బస్టాండ్ ఆవరణలో ఆటో యూనియన్ నాయకులు వెంకటయ్య, జంగయ్య ఆధ్వర్యంలో 25వ రోజు ఆటో రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఇప్పటి వరకు 3448 కిలోమీటర్లు ప్రయాణించిన ఈ యాత్రకు స్థానిక ఆటో డ్రైవర్లు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ మాట్లాడుతూ, మహిళలకు ఆర్టీసీ ఫ్రీ బస్సు ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లకు ఉపాధి కోల్పోయిందని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 83 మంది ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు తక్షణమే ఒక్కొక్కరికి రూ. 25 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్కు నెలకు రూ. 12,000 ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఆటో కార్పొరేషన్ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి దానికి రూ. 1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, చంద్రయ్య, మల్లేష్, విజయ్, శ్రీనివాస్, రవి, భరత్, కృష్ణ, శ్రీశైలం, గిరి, శంకర్ తదితర ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# కన్న కూతురిని కడతేర్చిన కసాయి తల్లి...

## గతంలో భర్తను హత్య చేసిన మహిళ...

నాగర్కర్నూల్ జిల్లాలోని లింగాల మండలం చెన్నంపల్లి గ్రామంలో ఘోరమైన ఘటన చోటుచేసుకుంది. కసాయి తల్లిగా మారిన మహిళ తన ఏడేళ్ల చిన్నారిని నిర్దాక్షిణ్యంగా హత్య చేసింది. చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ అనే మహిళ తన కూతురు నందిని (7) ను గొంతు నులిమి చంపిన అనంతరం ఆమె మృతదేహాన్ని గ్రామ శివారులోని నీటి గుంటలో పడేసింది. ఈ దారుణానికి పాల్పడిన ఎల్లమ్మ గతంలో తన భర్తను కూడా హత్య చేసిన మహిళగా పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా ఆమె భర్తను హత్య చేసిన తర్వాత జైలు శిక్ష అనుభవించింది. ఇప్పుడు మళ్లీ అదే దారుణానికి దిగిన ఘటన గ్రామంలో తీవ్ర కలకలం రేపుతోంది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎల్లమ్మపై హత్య కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఆమెకు మానసిక స్థితి సాధారణంగా లేదని కొందరు గ్రామస్థులు చెబుతుండగా, పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారిని హత్య చేసిన ఘటనపై గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. పాపను కాపాడాల్సిన తల్లే కడతేర్చడం పట్ల ప్రతి ఒక్కరూ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

# 50% సబ్సిడీపై అందుబాటులో జీలుగా విత్తనాలు

## మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్



**రామగిరి(ఆకాంక్ష న్యూస్) :** రామగిరి మండలంలో 50 శాతం సబ్సిడీపై జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. ఏ ర్ స్ కే బేగంపేటలో 95 క్వింటాళ్లు, డిసిఎంసి కల్వచర్లలో 70 క్వింటాళ్లు, డిసిఎంసి సుందిళ్లలో 85 క్వింటాళ్ల జిలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ పోను రైతు రూ. 2137.5 రూపాయలు చెల్లించాలన్నారు. పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డులు సమర్పించి పర్మిట్ పొంది విక్రయ కేంద్రాలలో విత్తనాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పచ్చి రొట్టె ఎరువులు అయినా జీలుగా విత్తనాల వాడటం వల్ల భూసారం పెంపొంది సేంద్రియ కర్బనం వృద్ధి చెంది నీటి నిలువ శాతం పెరగడం వల్ల అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అదేవిధంగా జీడిగా వాడటం వల్ల నత్రజని మొక్కకు అందుబాటులో ఉంటుందన్నారు. యూరియా వినియోగం తగ్గి పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని ఒక్క బ్యాగు 30 కేజీలు ఉంటుందని వివరాలకు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

# 9 ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తిపై కేసు:ఇన్స్పెక్టర్ సస్పెండ్



**వరంగల్(ఆకాంక్ష న్యూస్) :** భూకబ్జా కేసులో 9 ఏళ్ల క్రితం మరణించిన వ్యక్తిని నిందితుడిగా చూపిన ఏజే మిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జె. వెంకట రత్నంను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే, ఓ భూ వివాదంలో బాధితులకు న్యాయం చేయకుండా, తప్పుడు వివరాలతో కేసు నమోదు చేయడమే కాకుండా, మృతుడి పేరును కూడా కేసులో చేర్చి నిందితులకు సహకరించినట్లు విచారణలో తేలింది. అంతే కాకుండా, మరో కేసులో ఓ మహిళా నిందితురాలిపై స్టేషన్ ఆవరణలో లైంగిక వేధింపులకు పాల్పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణలో ఈ ఆరోపణలు నిజం కావడంతో కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీసు విభాగం పరువుకు నష్టం కలిగించిన నేపథ్యంలో బాధ్యత రహితంగా వ్యవహరించాల్సిన అధికారుల వైఖరిపై నిఘా పెంచినట్లు సమాచారం.

## పార్కింగ్ స్థలం చూపిస్తేనే వాహనానికి రిజిస్ట్రేషన్

### మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ కీలక ప్రకటన



**ముంబై(ఆకాంక్ష న్యూస్) :** మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ కీలక ప్రకటన చేశారు. కొనుగోలుదారు పార్కింగ్ స్థలం చూపించకుంటే తమ వాహనానికి రిజిస్ట్రేషన్ చేయబోమని ప్రకటించారు. తాము కొన్న వాహనానికి పౌర సంస్థ కేటాయించిన పార్కింగ్ స్థలానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను చూపిస్తేనే రిజిస్ట్రేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. ముంబై మెట్రోపాలిటన్ రీజన్‌లో పార్కింగ్ కొరత తీవ్రంగా ఉందన్నారు. దీన్ని అధిగమించేందుకు పార్కింగ్ ప్లాజాల నిర్మాణాన్ని అనుమతించడానికి పట్టణాభివృద్ధి శాఖ కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు.మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కీలక నిర్ణయం వెలువరించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఓ కొత్త ప్రతిపాదనను అమల్లోకి తీసుకొచ్చింది. ఇకపై పార్కింగ్ స్థలం ఉన్న వారికి మాత్రమే కార్లు అమ్మాలనే (%ఝుతీ్ఖుతీఎఅఅస్త్ర%) నిబంధనను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పార్కింగ్ స్థలానికి సంబంధించిన ప్రూఫ్ చూపిస్తేనే వాహనానికి రిజిస్ట్రేషన్ చేస్తామని ఆ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ తాజాగా ప్రకటించారు.'నగరంలోని పలు అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న ప్రజలకు తగిన పార్కింగ్ స్థలం లేకపోవడం వల్ల తమ కార్లను రోడ్లపై పార్క్ చేస్తున్నారు. దీనివల్ల జనాభా ఎక్కువ ఉన్న నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపై వేచి ఉండాల్సివస్తోంది. అంతేకాకుండా అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు అందించే అత్యవసర సేవలకు ఆటంకం కలుగుతుంది. వీటిని నివారించడానికి కార్లు కొనుగోలు చేసే వారు పార్కింగ్‌కు సంబంధించిన పత్రాలను సమర్పించాలని నిబంధన పెట్టాం' అని ఈ ఏడాది ఆరంభంలో ప్రతాప్ సర్నాయక్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం ప్రారంభం...



**మంథని (ఆకాంక్ష న్యూస్) :** ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంథని మండల స్థాయి వేసవి శిక్షణ కార్యక్రమం ను మంగళవారం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి దాసరి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శిక్షణలలో బోధనాభ్యాసన ప్రక్రియలు, విషయావగాహన ల పై కేంద్రీకరిస్తూ అనేక అంశాలు తెలియజేయబడతాయని, వాటన్నింటినీ సమగ్రంగా అవగాహన చేసుకుని రాబోయే విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులంతా అమలుపరచాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించుటకు ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఐదు రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం విషయాలపై రిసోర్స్ పర్సన్ లు బోధన అభ్యసన ప్రక్రియలపై, మూల్యాంకనంపై శిక్షణ అందించుచున్నారు. పై నాలుగు విషయాలకు తోడు పేరెంట్ టీచర్ మీటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, గ్రంథాలయం తదితర ఇతర విషయాల మీద శిక్షణా అందించబడుతుంది. మంథని మండలంలో మొత్తం 43 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. 91మంది ఎస్జీటీలు పనిచేయుచున్నారు. ప్రాథమిక స్థాయిలోని ఈ ఉపాధ్యాయులందరూ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పిలుగా ఎర్రం రమేష్, ఈర్ల రమేష్ , లోకే రాజ్ పవన్, బి చంద్రశేఖర్, ఎన్. లక్ష్మయ్య, కే లక్ష్మణ్ , బి కిషోర్, ఎం రాము. సిఆర్పి లు టి. మల్లన్న, కే సుప్రజ, ఎం రాధిక,ఏ స్వప్న పాల్గొన్నారు.

## తెలంగాణా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారి పోతుంది



**న్యూ డిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** ఫెడరల్ స్ఫూర్తి గురించి పదేపదే మాట్లాడే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు కావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా, పేర్లు మార్చుకుంటూ, పథకాల అమలులో నీరు కారుస్తున్న వైనాన్ని , తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు కాకుండా కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేస్తున్న విషయాన్ని కూడా వివరించారు .కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ను నార్త్ బ్లాకు కార్యాలయంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కలిసి అనేక అంశాలను వారి దృష్టికి తీసుకువచ్చారు , ఆవాస్ యోజన ,ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కుసుమ యోజన, స్థానిక సంస్థలకి, గ్రామపంచాయతీలకి ,పురపాలక సంఘాలకు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నుంచి విడుదలైన నిధుల వ్యవహారం విషయంలో కూడా ఏమి చేస్తున్నారు అన్న వివరాలను తెలియపరచడం జరిగింది . ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారి పోతుందని ఎఫ్ ఆర్ బి ఎం లిమిట్స్ దాటింది అని కొత్త అప్పు పుట్టే పరిస్థితి లేదని . అప్పుల కోసం వివాదాస్పదంలో ఉన్న ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టి జాతీయ బ్యాంకులపై ఒత్తిడి తీసుకొచ్చి రుణాలను పొందటానికి ప్రయత్నం చేస్తున్నటువంటి అంశాన్ని కూడా వివరించారు ,భూముల అమ్మకం ,బీర్ల అమ్మకం తో ఖజానా నింపాలని చూస్తున్నాడని వారికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయని ప్రభుత్వాల పట్ల కేంద్రం కఠినంగా వ్యవహరించే విధంగా చర్యలు గైకొనాలని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# 25 పెళ్లిళ్లు... 25 మోసాలు

### వధువు కావాలనుకునే యువకుల నుంచి రూ. 2-5 లక్షల వరకు వసూలు


- వధువు నటనలో మేటి అనురాధ
- వివాహం జరిగిన కొన్ని రోజులకే డబ్బు, నగలతో పరార్



**రాజస్థాన్ (ఆకాంక్ష న్యూస్) :** వధువు కోసం వేటలో ఉన్న యువకులకు ఇది గుణపాఠంగా మిగలే కథ! 'ఒక్కసారి పెళ్లి అయితే జీవితాంతం తోడుగా ఉంటా' అంటూ యువకుల్ని మాయలో ముంచిన ఓ నిత్య పెళ్లికూతురు చివరికి పోలీసుల బోనులో పడింది. తన అందం, మితాసైన మాటలతో ఇప్పటివరకు 25 మంది యువకులను పెళ్లి చేసుకుని, వారిలోని అమాయకత్వాన్ని వంచించి, లక్షల్లో డబ్బు, నగలు కొల్లగొట్టిన అనురాధ అనే మహిళ చివరకు రాజస్థాన్ పోలీసులకు చిక్కింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సునీత, రాజస్థాన్‌కు చెందిన పప్పు మీనా అనే వ్యక్తులు వధువును వెతుకుతామని హామీ ఇచ్చి, ఓ యువకుడైన విష్ణు శర్మకు అనురాధ ఫోటోను చూపించారు. పెళ్లికి ముందే రూ. 2 లక్షలు తీసుకుని, ఏప్రిల్ 20న పెళ్లి చేయించారు. కానీ, వివాహం జరిగిన 12 రోజుల్లోనే అనురాధ డబ్బు, నగలు, మొబైల్‌తో పరారై, విష్ణును షాక్‌కు గురిచేసింది. మే 3న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు ముఠా బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టగా అనురాధ భోపాల్‌లో ఉందని తెలిసింది. ఒక్కసారిగా సినిమా సన్నివేశంలా మారిన ఈ ఆపరేషన్‌లో, ఒక కానిస్టేబుల్ వధువు కోసం వెతికే వరుడిలా నటించాడు. బ్రోకర్ చూపించిన ఫోటోలలో అనురాధను గుర్తించి, పరిస్థితులను గమనించి ఆమెను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్‌కు చెందిన అనురాధ, యావత్ ఉత్తర భారతంలో బ్రైడ్ మాఫియా నెట్‌వర్క్‌కు ఒక కీలక కీ లింక్‌గా మిగిలింది. ఎట్టకేలకు పోలీసుల తెలివితేటలతో ఆమె పట్టు పడింది. ఇటువంటి మోసాలను నిరోధించేందుకు యువకులు అజాగ్రత్త వహించాలని, పెళ్లికి ముందే పూర్తి వివరాలను తెలుసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇకపోతే 'వధువు' అనే పదమే చాలామందికి గడచిన గుర్తుగా మిగలే ప్రమాదం ఉంది!

# రైస్ జన్యు మార్పిడి విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం హేయనీయం

- ఈ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న ఫుడ్ సిస్టమ్ పై ప్రభావం...
- వరి జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహ-రించుకోవాలని లేఖ...
- కేంద్రానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గారి లేఖ....



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** రైస్ జన్యు మార్పిడికి కేంద్రం అనుమతించడాన్ని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖరాశారు. రైస్ జన్యు మార్పిడి విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం అత్యంత తీవ్రమైందని అభివర్ణించారు. ఈ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న ఫుడ్ సిస్టమ్ పై ప్రభావం చూపుతుందన్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా వున్నప్పుడు ఆహార పంట అయినా వంకాయ జన్య మార్పిడిని కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అప్పటి దేశ ప్రధాని మన్మోహన్ సింగ్.. రాష్ట్ర రైతాంగం అభిప్రాయాన్ని మన్నించి ఆ ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రం లో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వరి ధాన్యాన్ని ఎక్కువ ఉత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణ అని.. ఇక్కడి రాష్ట్ర రైతాంగం తరుపున రైతు కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రైస్ వినియోగదారుడిపై కూడా తీవ్రమైన ప్రభావం పడ్తుందని, ఎక్కువ శాతం వరి పండించే తెలంగాణపై ఈ నిర్ణయంతో తీవ్రమైన ఆర్ధిక ప్రభావం పడుతుందని చైర్మన్ కోదండరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. అంతేకాదు విత్తన హక్కుకు కూడా భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కీలకమైన ఈ నిర్ణయం తీసుకోకముందు రాష్ట్ర అభిప్రాయం తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు, అంతేకాదు వినియోగదారులను పరిగణలోకి తీసుకోకపోవడం తీవ్రమైన విషయంగా కమిషన్ పరిగణిస్తుందన్నారు. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భారతదేశ వ్యవసాయము రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో కాలయాపన...

- రైతుల ఆత్మహత్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి...
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం...
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఫైర్.



**న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను పొడిగించి కాలయాపన చేస్తున్నట్టు బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియా సమావేశంఈ విచారణకు గడువు పూర్తయినా, దానికి సంబంధించి ఎవరికైనా నిర్దిష్ట బాధ్యత కేటాయించకుండా, విచారణను నీరు కార్చుతున్నట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విచారణ గడువు పూర్తయినప్పటికీ, ప్రతి రోజూ కొందరు మాత్రమే విచారణకు హాజరయ్యేలా సమన్లు పంపుతూ, విచారణను నిర్దిష్టంగా కొనసాగించక గడువును మళ్లీ పొడిగిస్తోందని ఆయన విమర్శించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటివి గతంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల విచారణలో కూడా జరిగాయని, దాన్ని నీరుగార్చడం వలన దోషులను శిక్షించలేని పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే పునరావృతమవుతోందని హెచ్చరించారు. కాళేశ్వరం విచారణ విషయంలో కూడా అదే పరిస్థితి దృష్టిలోకి వస్తోందని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన కుంటుపడినదిగా, రైతులకు కావలసిన మద్దతు అందకుండా, అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే విద్యార్థుల ఫీజు రీఇంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం, పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్య సాధించడంలో సమస్యలు ఎదుర్కొంటున్న విషయాలను కూడా ఆయన తెలిపారు. కేంద్ర పథకాల అమలు బాటలో తెలంగాణ ప్రభుత్వం బలహీనంగా ఉందని, కేంద్ర పీఎం కుసుమ్ పథకం వంటి పథకాల సబ్సిడీలను కూడా విడుదల చేయడంలో విఫలమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాత పథకాల అమలుకు ఆటంకాలు కలిగిస్తూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలకు నష్టమే చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ పార్టీల మధ్య డీల్స్, అంతర్గత ఒప్పందాలు ప్రజలకు మేలు చేయవని, బిజెపి మాత్రం ప్రజల కోసం నిజాలను బయటపెట్టి ప్రజల శ్రేయస్సు కోసం నిలబడుతుందని ఎన్.వి.ఎస్.ఎస్. పేర్కొన్నారు.ఇప్పటి వరకు భారతీయ జనతా పార్టీలో పెద్ద చేరికలు లేనప్పటికీ, ప్రజల మద్దతుతో తెలంగాణలో మరింత బలోపేతం అవుతుందన్నారు. తెలంగాణ బిజెపి అధ్యక్షుడి ఎన్నిక ప్రజాస్వామ్య విధానంలో, సమయానుగుణంగా జరుగుతుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్ నగరం లో మరో అగ్నిప్రమాదం



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ నగరం లో మరో అగ్నిప్రమాదం జరిగింది. నగరంలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనం రెండో అంతస్తులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో దట్టంగా పొగ కమ్ముకుంది. మంటలు చెలరేగడంతో భవనంలోని నివాసితులు వెంటనే కిందకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా, రెండు రోజుల క్రితం పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబంలోని 17మంది ప్రాణాలు కోల్పోయారు.

# సరస్వతి పుష్కరాల్లో ప్రజాప్రతినిధులుకు ఎవరికి అవమానం జరుగలేదు

## కాళేశ్వరం కమిషన్ నోటీసులపై ఆనాటి సిఎం,ఇరిగేషన్,ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వాలి...

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్..



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్)** సరస్వతి పుష్కరాల్లో ప్రజాప్రతినిధులుకు ఎవరికి అవమానం జరుగలేదు....ఈ విషయంలో ఎవరిని నిందిచాల్సిన అవసరం లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ కేసీఆర్,హరీష్ రావు,ఈటెల రాజేందర్ నోటీసులు విపక్షాలు ఎలా నోటీసులు ఇస్తారు అని అంటున్నారు. కాళేశ్వరం ఆనాటి సిఎం,ఇరిగేషన్,ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందికాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక కోణంలో నిర్ణయం తీసుకుంటుంది... అందుకే కమిషన్ వేశాంఈటెల రాజేందర్ ని కేసీఆర్ కావాలనే బిజెపిలోకి పంపారా? ఈటెల రాజేందర్ బిఆర్ఎస్ తప్పు చేసి బిజెపిలోకి వచ్చారా?ఇప్పుడు బిజెపి వారిని కాపాడుతుందా?తప్పు ఎవరు చేసిన జైలుకి వెళ్ళాల్సిందే...అది ఎవరైనాతెలంగాణ దొంగలకు దొంగల దొడ్డిగా మార్చారు3 ఏళ్లలో ఒక్కపిల్లర్ పోతే ఏం అవుతుంది అని కేసీఆర్ అంటున్నాడు నాగార్జున సాగర్,శ్రీశైలం ఎందుకు ఒక్క పిల్లర్ కూడా కూలలేదుగతంలో గవర్నర్ కాళేశ్వరరావు అన్నారు ఇప్పుడు కూలగానే నోవేశ్వర్ రావు అంటున్నాడు ప్రాజెక్ట్ కోసం భూదందా చేసేవారిలా ఇష్టం వచ్చినట్లు భూములు లాక్కున్నారు వీళ్ళ ముగ్గురికి జైలుకి వెళ్ళడానికి అన్ని అర్హతలు ఉన్నాయిగుడ్డిగా ఆర్థిక అనుమతులు ఎలా ఇచ్చారు ఈటెల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఊరికినే భట్ట కాల్చి మీద వేయదు....రాజ్యాంగ బద్దంగా వ్యవహరించి విచారణ చేసి చర్యలు తీసుకుంటాంచట్టానికి ఎవరు అతీతులు కాదు...కేసీఆర్ నిజాయితీ నిరూపించుకుంటే పూలదండలు వేస్తాం బిజెపి నాయకులర్లా కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒకటి అవుతారు అని అన్నారు అందుకే అరెస్టు చేయడం లేదు అన్నారు ....ఇప్పుడు మీ నాయకుడు ఉన్నారుఈటెల సీల్డ్ కవర్లో ఏదో దాచిపెట్టారో అని అది రాలేదు అనే నోరు జరారుబిజెపి పార్టీని ప్రశ్నిస్తే దేశ ద్రోహులా?బిజెపి పార్టీ దేశ స్వాతంత్ర్య పోరాటానికి సంబంధం ఏంటి?కిషన్ రెడ్డి లాంటి బానిసలు ఉండబట్టే ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం బిజెపి అంటే బూతు జనతా పార్టీకిషన్ రెడ్డి నువ్వేనా మరి సోషల్ మీడియా నడిపించేది నువ్వేనా?ప్రపంచంలో మూడు జెండర్స్ ఉన్నాయి....ఇవి కాకుండా భూతులు మాట్లాడే వారు ఏ జండర్ కాక ఎవరో తేల్చుకోవాలి? చైనా పైన ఎందుకు మాట్లాడటం లేదు పాకిస్తాన్ వదిలిన ప్రతిబాంబు చైనా తయారు చేసిందేనన్నారు.





# తభిత ఆశ్రమంలో వివాహ మహోత్సవం..

### మానవత్వాన్ని చాటిన కందుల సంధ్యారాణి

**గోదావరిఖని(ఆకాంక్ష న్యూస్) :** తభిత ఆశ్రమం ఓ నిరుపేద మహిళ జీవితాన్ని మార్చి వేసింది. జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన రాజేష్‌తో ఆమెకు ఆశ్రమ నిర్వాహకులు వివాహాన్ని నిశ్చయించగా పెద్దపల్లిలోని శ్రీ వేంకటేశ్వర కళ్యాణమండపంలో ఇది ఘనంగా జరగింది.పుట్టిన ఇంటి ఒడిలో పెరుగకపోయినా, తల్లిదండ్రుల ఆశీర్వాదాలు లేకపోయినా%ఔ% ఆశ్రమమే అమ్మచెయ్యిగా మారింది. వివాహ ఖర్చులన్నింటినీ భుజాన వేసుకుని, పెళ్లికూతురిగా మానసను అందంగా ముస్తాబు చేసింది. ఇది మామూలు పెళ్లి కాదు %-% ఓ జీవితానికి నూతన ఆరంభం. ఈ వేడుకలో బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై, మానసకు కొత్త వస్త్రాలు అందించి, తన ప్రేమాభివందనాలతో ఆశీర్వదించారు. అనంతరం కందుల సంధ్యారాణి మాట్లాడుతూ...ఈ సమాజంలో నిరుపేదలకు అండగా ఉండటమే నిజమైన సేవ. మానస భవిష్యత్తులో ఎటువంటి సహాయం అవసరమైనా, నేను ఉన్నాను" అని ఆమె హృదయపూర్వకంగా ప్రకటించారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, వివాహాన్ని నిర్వహించిన మిత్ర వర్గం, బంధుమిత్రులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.మానవతా విలువలు మరుగున పడుతున్న ఈ కాలంలో %-% తభిత ఆశ్రమం, కందుల సంధ్యారాణి వంటి వ్యక్తులు చూపిన ప్రేమ, మానసకు ఇచ్చిన నూతన జీవనం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి.నిరుపేదలకు అండగా ఉండటం ద్వారా మనిషిగా మనం చూపవలసిన బాధ్యతను నెరవేర్చగలమని . మానస తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా, ఆమెకు నా ఆశీస్సులు తెలియజేస్తున్నానని భవిష్యత్తులో ఆమెకు అవసరమైన సాయం అందించేందుకు నేను సిద్ధంగా ఉంటానని కందుల సంధ్యారాణి తెలిపారు.



# గిరిజన ఆదివాసీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆసిఫాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గిరిజన ఆదివాసీలపై నిజంగా ప్రేమ ఉంటే వారి మంత్రిత్వ శాఖను గిరిజనులకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ రోజు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఆయన చెప్పిన 24 గంటల కరెంటు బోగస్‌గా మారింది. గ్రామాల్లోకి వెళితే కరెంటు పరిస్థితి ఎలా ఉందో స్పష్టంగా తెలుస్తుంది. రుణ మాఫీ సరిగా జరగలేదు, రైతు భరోసా ఇంకా పూర్తి కాలేదు. ఇందిరమ్మ ఇండ్లు ఎవరికి ఇస్తున్నారు? తులం బంగారం హామీ ఏమైంది? పెన్షన్లు పెంచుతామని చెప్పారు కానీ ఇంకా పెరగలేదు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లను ఎందుకు బంద్ చేశారు?" అని కోవ లక్ష్మి నిలదీశారు.

### అన్ని వర్గాలను మోసం చేసిన ప్రభుత్వం

కోవ లక్ష్మి మాట్లాడుతూ, "అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని ద్రోహించింది. ఇప్పుడే ప్రజలే స్వయంగా ముందుకు వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడుతున్నారు," అని అన్నారు.

### ఇతిహాసాన్ని మర్చిన రేవంత్ రెడ్డి

"ఇంద్రవెల్లిలో 1981లో ఆదివాసీలపై కాల్పులు జరిపింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే. గిరిజనులకు న్యాయం చేయాలంటే నామమాత్రపు కార్యక్రమాలు కాదు, నిఖార్సైన అభివృద్ధి కార్యక్రమాలు అవసరం. గిరిజనులకు నిజంగా మేలు జరిగిందంటే అది కేసీఆర్ హయాంలోనే. కొమురం భీం పేరిట కొత్త జిల్లాను ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. బంజారా భవన్, ఆదివాసీ భవన్‌ల నిర్మాణం, సంస్కృతి అభివృద్ధికి నిధుల కేటాయింపులు%ఖశ్రీశ్రీ ష్ఘుజూజూవఅవస బఅసవతీ ఖజ= శ్రీఝసవతీంష్ట్రఅజూ%," అని వివరించారు.

### 'గిరి వికాసం' పేరులో మార్పుతో మాయ చేయొద్దు

రేవంత్ రెడ్డి గిరిజన అభివృద్ధి కార్యక్రమాలకు 'గిరి వికాసం' పేరులో మార్పు చేసి కొత్తగా చేసినట్టు చెప్పుకోవడం శోచనీయం అని అన్నారు. "కేసీఆర్ హయాంలో ఇవ్వబడిన పట్టాలనే ఇప్పుడు మళ్లీ ఇచ్చి తన శ్రేయస్సుగా చూపుకోవడం తగదు. చేతనైతే కొత్తగా ఇవ్వండి. ఆదివాసీ గూడేలు, తండాల్లో రోడ్లు పాడవుతున్నా, బాగు చేసే యత్నం లేదు," అని మండిపడ్డారు.

### ముఖ్యమంత్రి అసత్యాలను మానుకోవాలి

చివరిగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తూ, "గిరిజన ఆదివాసీలు ఇప్పుడు అసత్యాలను నమ్మే స్థితిలో లేరు. వారి అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం మాత్రమే ప్రజల మద్దతు పొందుతుంది. ముఖ్యమంత్రి అసత్యపు మాటలను మానుకోవాలి," అని హెచ్చరించారు.ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో గిరిజన సమస్యలు, అభివృద్ధి అజెండాపై మరోసారి చర్చ మొదలైనట్టైంది.



# కేసీఆర్ ను ఫామ్‌హౌస్‌కు వెళ్లి కలిసిన హరీశ్‌రావు



**గజ్వేల్(ఆకాంక్ష న్యూస్) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అలాగే మాజీ మంత్రులు హరీశ్‌రావు ఈటల రాజేందర్‌కు కూడా జస్టిస్ ఘోష్ కమిటీ నోటీసులు ఇచ్చింది. ఈ పరిణామాల మధ్య కేసీఆర్ ను.. హరీశ్‌రావు ఎర్రవెల్లిలో ఉన్న ఫామ్‌హౌస్‌కి వెళ్లి కలిశారు. నోటీసులు వచ్చిన నేపథ్యంలో వీరిద్దరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ విచారణ చేస్తోంది. అయితే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు ఆథిక మంత్రిగా ఈటెల రాజేందర్ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే జూన్ 5న కేసీఆర్, 6న హరీశ్‌రావు, 9న ఈటెల రాజేందర్ విచారణకు హాజరు కావాల్సిందిగా కమిషన్ నోటీసుల్లో పేర్కొంది.

# సమాచార కమిషనర్ లో బీసీలకు న్యాయం చేయండి

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వినతి పత్రం



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కలిసి సమాచార కమిషనర్ లో బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. బీసీ ప్రతినిధుల బృందంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, నాయకులు అయిలి వెంకన్న, ఎలికట్టు విజయ్ కుమార్, ఇంద్రం రజక, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# కాక కోటాలో వారసుడికి అవమానం...

సందేహాలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.. ఎంపీగా ఉన్న గడ్డం వంశీ, తన నియోజకవర్గం అభివృద్ధిలో క్రియాశీలంగా పాల్గొంటున్నా, కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో ఆయనకు గుర్తింపు ఇవ్వకపోవడాన్ని అభిమానులు, నాయకులు అన్యాయంగా భావిస్తున్నారు. వెనుకబడిన వర్గాలపై ఎందుకు ఈ మైకమైన వివక్ష అని కొంత మంది నాయకులు, వారి అభిమానులు ప్రశ్నిస్తున్నారు. కాక వెంకటస్వామి తెలంగాణ రాజకీయాల్లో "గుడిసెల వెంకటస్వామి"గా పేరొందిన నేత. మూడు పర్యాయాలు ఎంపీగా సేవలందించి, ప్రత్యేకించి సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడిన నాయకుడు. ఆయన కుమారుడు వివేక్ వెంకటస్వామి కూడా ఎంపీగా పని చేశారు, ఆయన సతీమణి అంబేద్కర్ యూనివర్సిటీ స్థాపన ద్వారా పేద విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దిన ఘనత కూడా వారికే దక్కుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఎన్నో పరిశ్రమలను నెలకొల్పి ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను సైతం కల్పించి బడుగు బలహీన వర్గాలు, కార్మికుల జీవితాల్లో వెలుగులను నింపారు. దీంతో విద్య, సేవ, పేదల పక్షపాతి కుటుంబంగా ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. వెనుకబడిన దళిత వర్గానికి చెందిన గడ్డం వంశీ, తన తాత పాత్రాన్నే నిలబెట్టే ప్రయత్నంలో ఉన్నారు. తాత ఆశయాలకు అనుగుణంగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపైనే పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. వారసుడి పరిపాలన తాతని గుర్తు చేయడంతో ఆయన రూపంలో దివంగత నేతను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పారిశ్రామికవేత్తగా ఉన్నప్పటికీ, ప్రజల అభిమానాన్ని నమ్ముకొని రాజకీయ రంగ ప్రవేశం చేశారు. భారీ మెజార్టీతో గెలిచి, ఒదిగి ఉండే స్వభావంతో ప్రజలతో మమేకమవుతున్నారు. ఈ సందర్భంగా తనకు జరిగిన అన్యాయంపై ఫ్లెక్సీలలో తన పేరు లేకపోవడంపై గడ్డం వంశీ సోషల్ మీడియాలో స్పందిస్తూ %-%"నా తాత ఆశయాల మేరకు పనిచేస్తున్న నన్ను, నా నియోజకవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమల్లో గుర్తించకపోవడం బాధాకరం. నేను దళితుడినన్న కారణంగానే ఈ అవమానం జరిగిందా?" అంటూ ప్రశ్నించారు. అలాగే కొంత మంది అగ్రవర్ణ నేతల కుట్ర ఇది" అని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించకుండా ఎన్ని ఇబ్బందులు పెట్టిన ఎన్ని రకాలుగా అవమానపరిచిన ప్రజల కోసం, ప్రజలు పెట్టుకున్న నమ్మకం కోసం వారి వెంటే ఉంటూ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. పుష్కరాల్లో జరిగిన ఘటనపై వివిధ దళిత సంఘాలు, మేధావులు ఈ అంశంపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టి సారించాలని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ సంఘాల నేతలు సంబంధిత ఉన్నత అధికారులకు ఎస్సీ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదులను అందించారు.

### ప్రజా ప్రతినిధుల మౌనం - కాంగ్రెస్ పార్టీపై తిరోగమనం?

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి నేతలకు మౌనం కలిగిస్తోంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆయా నాయకులకు సంబంధించిన నేతలు రెండు వర్గాలుగా విడిపోవడం తీవ్ర స్థాయిలో చర్చకు దారితీస్తుంది. సామాజిక సమానత్వానికి కట్టుబడి ఉన్న పార్టీగా పేరుగాంచిన కాంగ్రెస్ %-% ఒక దళిత ఎంపీకి జరిగిన ఈ సంఘటనపై స్పందించకపోతే, నైతిక పరిపాలనపై ప్రశ్నలు తలెత్తకుండా ఉండవు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

### మూసివేసే మాట...

కాక కుటుంబం రాజకీయంగా చేసిన సేవలు తెలంగాణకు మరువలేనివి. అలాంటి వారసుడికి జరిగిన అవమానం పట్ల అధికార పార్టీ తగిన స్పందన చూపకపోతే, అది సామాజికంగా, రాజకీయంగా ప్రమాదకరమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం గడ్డం వంశీ విషయంలో కాదు %-% సామాజిక న్యాయంపై నమ్మకంగా ఉన్న ప్రతి ఒక్కరి ప్రశ్న... గతంలో కూడా ఎన్నో కార్యక్రమాల్లో ఇలాగే జరగడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు తలెత్తాయి. ఇప్పటికైనా దీనిని సరిదిద్దకపోతే రాజకీయ వ్యాప్తంగా తీవ్రస్థాయిలో విమర్శలు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

